ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు

5

శనివారం 29 నవంబరు 2025



వెబ్‌ల్యాండ్‌లో ప్రభుత్వ భూమి, రోడ్డుగా ఉన్న దృశ్యం



పులివెందుల మెడికల్ కళాశాలకు

ఎకరం రూ.100తో భూ కేటాయింపులు

● మంత్రి మండలి ఆమోదం

పులివెందుల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మెడికల్ కళాశాలను రాష్ట్ర ప్రభుత్వం పీపీసీ మాడల్‌లో రూపొందించ నుంది. ఇందుకోసం మెడికల్ కళాశాలకు సంబంధించి 51.51 ఎరాలను లీజుకు ఇవ్వ డానికి శుక్రవారం మంత్రిమండలి నిర్ణయిం చింది. ఏడాదికి ఎకరాకు రూ.100 చొప్పున 66 ఏళ్ల పాటు లీజుకు ఇస్తూ నిర్ణయించింది. 66 ఏళ్ల తర్వాత అన్ని మౌలిక సదుపాయా లు, ఆస్థులు ప్రభుత్వానికి తిరిగి బదిలీ చేయాల్సి ఉంటుంది. సీట్ రిజర్వేషన్ కేటగి రీలో ప్రభుత్వ కోటా కింద 50 శాతం సీట్లు ఉంటాయి. అలాగే ఫీజులను ఏపీహెచ్ఈ ఆర్ఎంసీ నియంత్రిస్తుంది. 70 శాతం ఆసు పత్రిలో పడకలు ఉచితంగా ప్రభుత్వ ఆరోగ్య పథకాలను అనుసంధానిస్తారు. రెండు సంవ త్సరాలు ఆసుపత్రిలోని సిబ్బంది జీతాలకు ప్రభుత్వం సహకరిస్తుంది.. భవిష్యత్తులో డెంటల్ కాలేజీ, నర్సింగ్ మరియు పారా మెడికల్ ఇన్‌స్టిట్యూట్, ఆయుష్ స్థాపన, శిక్షణ, బోధన కేంద్రాల అభివృద్ధికి అనుమతు లు ఉంటాయి. వీటన్నింటి ద్వారా వచ్చే ఆదా యంలో 3 శాతం ప్రభుత్వానికి చెల్లించాలి. వైద్య కళాశాల, ఆసుపత్రులు ప్రభుత్వ బ్రాం డింగ్‌తో పనిచేస్తాయి. అందులో 30 శాతం వరకు ప్రైవేట్ బ్రాండింగ్‌కు అనుమతి ఉంటుంది. విద్య, క్లినికల్ మరియు సేవా ప్రమాణాలను స్వతంత్ర పర్యవేక్షణ సంస్థ పర్యవేక్షిస్తుంది.

మూడు రోజుల పాటు జిల్లాలో వర్షాలు



కడప కలెక్టరేట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను ప్రభావంతో 3 రోజుల పాటు జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో తుపాను ప్రభావం ఉన్నందున ఆ యా జిల్లాల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. దిత్వా ప్రభావంతో అక్కడక్కడ భారీ వర్షాలు, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపారు.

దారినీ వదల్లేదు

● రూ.3 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జా



రహదారిని చదును చేసిన దృశ్యం



(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో కడప నగరంలో రింగు రోడ్డు చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములు డీకేటీ, వాగులు వంకలను భూ బకాసురులు ఆక్రమించారు. ఇటు సీకేదిన్నె, అటు వల్లూరు మండలాల రెవెన్యూ పరిధి రింగు రోడ్డుకు ఆనుకుని ఉన్నాయి. దీంతో వైసీపీకి చెందిన భూ బకాసురులు అడ్డగోలుగా ఆక్రమించేశారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసి ప్రజలకు కట్టబెట్టారు. కబ్జా చేసింది సామాన్యులు కాదు.. అప్పట్లో నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లుగా ఉన్నవారే. అయితే వైసీపీ అక్రమాలపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. కడప రింగు రోడ్డు చుట్టూ జరిగిన భూ ఆక్రమణలపై కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ భూములు ఎవరెవరు ఆక్రమించారో జాబితా అందించారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ విచారణ చేపట్టి అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకుంటూ వస్తున్నారు. రింగు రోడ్డు చుట్టూ జరిగిన భూ ఆక్రమణలు గుట్టు రట్టవుతూ వస్తోంది. తాజాగా దాదాపు రూ.3 కోట్ల విలువ చేసే రహదారిని కబ్జా చేస్తుండటం వెలుగులోకి వచ్చింది. అది కూడా నగర శివారులోని శివసాయినగర్ ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారి కావడం గమనార్హం.

రూ.కోట్ల భూమిపై కన్నేశారు

కడప - రాయచోటి రహదారిలో భూముల ధరలు విపరీతంగా ఉన్నాయి. ముఖ్యంగా రింగు రోడ్డు చుట్టూ ఎటు చూసినా ఎకరం రూ.3కోట్లు పైమాటే. ఇక ఐటీఐ సర్కిల్ నుంచి రాయచోటి వెళ్లే సర్కిల్‌లో అయితే రోడ్డుకిరువైపులా సెంటు రూ.30లక్షల పైమాటే ఉంది. ఇక్కడ కన్వెన్షన్ సెంటర్లు, ఇనిస్టిట్యూట్‌లు, అపార్ట్‌మెంట్లు, హోటల్స్ ఉన్నాయి. దీంతో రోడ్డు పక్క బారెడు జాగా ఉన్నా లక్షాధికారే. కరెక్టుగా సర్కిల్ ముందే ఓ అపార్ట్‌మెంటు సమీపంలో సీకేదిన్నె మండలంలోని ఊటుకూరు రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 112/2లో 81 సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. దీనికి సమీపంలోని శివసాయినగర్ ఎస్సీ కాలనీకి వెళ్లేందుకు 2011లో అప్పటి ప్రభుత్వం ల్యాండ్ అక్విజేషన్ ద్వారా ఈ భూమిని రహదారి కోసం కొనుగోలు చేసింది. ఇప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమి స్వభావం రోడ్డుగా ఉంది. వెబ్‌ల్యాండ్‌లో ప్రభుత్వభూమి, రోడ్డుగా ఉంది. దీనిపైపై వైసీపీ నేత కన్ను పడింది.

రోడ్డును చదును చేశారు

ఐటీఐ సర్కిల్ నుంచి రాయచోటి వెళ్లే రహదారి పొడవునా బాగా విస్తరిస్తోంది. ఇటు ప్రకృతినగర్‌తో పాటు చుట్టుపక్కల కన్వెన్షన్ సెంటర్లు, అపార్ట్‌మెంట్లు రావడంతో ఇక్కడ భూములకు మంచి డిమాండ్ ఉంది. రోడ్డు పక్కన సెంటు రూ.20 లక్షల నుంచి 35లక్షల వరకు పలుకుతోంది. ఇంత డిమాండ్ ఉన్న ఏరియాలో వైసీపీ నేత, ఓ ఫైనాన్షియర్‌కు స్థలం ఉందని చెబుతారు. ఆ నేత సన్నెవరు ఆపేదన్నట్లుగా ఏకంగా ఈ రోడ్డు స్థలాన్నే ఆక్రమించి చదను చేశారు. ఇక్కడ సెంటు కనీసం రూ.25లక్షలు వేసుకున్నా ఆక్రమణకు గురవుతున్న రోడ్డు విలువ రూ.3 కోట్లకు పైగానే ఉంటుంది. కూటమి ప్రభుత్వంలో ఇంకా కొందరు రెవెన్యూ అధికారులు మారలేదనే విమర్శ ఉంది. గతంలో పనిచేసిన యంత్రాంగమే ఇప్పటికీ ఉండడంతో అడ్డగోలుగా కబ్జా చేసినా పట్టించుకోవడం లేదంటున్నారు. అందుకే ఇప్పటికీ వైసీపీ నేతలు బరితెగిస్తున్నారని అంటున్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

కడప కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశిం చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా పారిశ్రా మిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేసి విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పరిశ్రమల నూతన పాలసీ విధానానికి అనుగుణంగా జిల్లా ఆర్థికాభివృద్ధికి దోహద పడేలా నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సా హం అందజేయాలన్నారు. పారిశ్రామికాభి వృద్ధి పాలసీ 2024-29 ద్వారా ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకి సంబంధించి 5 ట్రాన్స్‌పోర్ట్ వాహనాల ఇన్వెస్టిమెంట్ సబ్సిడీ కింద రూ.67.08 లక్షల రాయితీకి కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. మహిళల ప్రత్యేక ప్యాకేజీ కింద ఒక పరిశ్రమకు రూ.70.93 లక్షలు విడుదలకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమల జీఎం చాంద్ బాషా, ఏపీఐఐసీ జెడ్ఎం శ్రీనివాసమూర్తి, లీడ్ బ్యాంకు మేనేజరు జనార్ధనం, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

● అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలి : ఎస్పీ

కడప క్రైం, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మైదుకూరు సబ్ డివిజన్ పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. వాహన రికార్డులు సక్రమంగా ఉండేట్లు చూడాలన్నారు. బాలికలపై, మహిళలపై వేధింపులపై వారికి అవగాహన కల్పించాలన్నారు. గ్రామసభలు, పల్లెనిద్ర గ్రామాల సందర్శన తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా గంజాయి, ఇతర మత్తుపదార్థాలు, బహిరంగ మద్యపానం చేసేవారిపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదికకు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలు తీర్చాలన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్లు, గతంలో నేరాలకు పాల్పడిన వారి కదలికలపై దృష్టి పెట్టాలన్నారు. శక్తిటీంలు పనితీరు మెరుగు పరచుకోవాలన్నారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, సబ్ డివిజనులోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఇద్దరు అధికారులపై వేటు

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఏఎంసీకి సంబం. దించిన నిధుల వినియోగంలో అనుమతులు లేకుండానే రూ.11లక్షలు డ్రా చేసిన అంశం పై ప్రభుత్వం ఇద్దరు అధికారులపై వేటు వేసింది. విచారణలో ఆరోపణలు రుజువుకా వడంతో ప్రభుత్వం ఇద్దరు అధికారులకు శిక్ష విధించింది. వ్యవసాయ మరియు సహకార శాఖ శుక్రవారం విడుదల చేసిన జీఓ ఆర్టీ 1023 ప్రకారం.. సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి, డీఈ (ఏఎం) కె.సుబ్బారెడ్డిపై విచారణాధికారి సమర్పించిన నివేదిక, డీఓఏఎం సమర్పించిన విశ్లేషణ ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. నిర్మాణ పనుల కు సంబంధించిన నిధుల డ్రాయింగ్ విష యంలో లోపాలున్నాయని ప్రభుత్వం భావిం చి తదుపరి చర్యలు తీసుకోవాలని వ్యవసా య మార్కెటింగ్ డైరెక్టర్‌కు ప్రభుత్వం ప్రత్యేక చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ శుక్రవా రం ఆదేశాలు జారీచేశారు.

అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సస్పెన్షన్

● ఆదేశాలు జారీ చేసిన మంత్రి

పులివెందుల,నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పులివెందుల అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్, సంక్షేమ, చేనేత, జౌళి శాఖ కార్యాలయం నుంచి మత్రి సవిత పేరుతో ఒక ప్రకటన విడుదల అయింది. పులివెందుల ఏబీసీడబ్ల్యూఓ బి.జ్యోతిపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయని తెలిపారు. వీటిపై జాయింట్ డైరెక్టర్ విచారణ చేపట్టగా జ్యోతిపై వచ్చిన ఆరోపణలు రుజువయ్యాయని తెలిపారు. దీనితో ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేయాలని ఆదేశించామని పేర్కొన్నారు. అక్రమాలకు పరోక్షంగా సహకరించిన జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి అంజలాదేవిని హెడ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే ఎంతటివారినైనా కఠినంగా శిక్షిస్తామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎఫ్‌పీవోలను బలోపేతం చేయాలి

● డీఎంసీ సమావేశంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతు ఉత్పాదక సంస్థల(ఎఫ్‌పీవో)ను బలోపేతం చేసే దిశగా సంబంధిత శాఖల అధికారులు కృషిచేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి డీఎంసీ సభ్యులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కేంద్ర ప్రభుత్వ పథకం అయిన రైతు ఉత్పాదక సంస్థల ఏర్పాటు, యాజమాన్యం అనే అంశంపై జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్పత్తి అనుకూలతలను గుర్తించి, అనుబంధ విభాగాలు, ఇతర వాటాదారుల మద్దతుతో ఆ యా ఎఫ్‌పీవోలను అభివృద్ధి చేసేందుకు వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. జిల్లాలో సేవా దృక్పథంతో నడిచే ఎఫ్‌పీవోల ఏర్పాటును రైతులు ప్రోత్సహించాలన్నారు. మినీ మార్కెట్‌గా ఎదిగే అవకాశాలు ఉన్న ఎఫ్‌పీవోలను అభివృద్ధి చేసేందుకు వ్యవసాయ శాఖ దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 37 ఎఫ్‌పీవోలు నడుస్తు న్నాయని అయితే ఒక జిల్లా నుంచి ఒకే ఉత్పాదకతను అనుసరించి.. అరటి, చీనీ పటలను జిల్లా ప్రధాన ఉత్పాదకంగా గుర్తించి దిగుబడి, మార్కెటింగ్‌పై దృష్టి పెట్టాలన్నారు. ఎఫ్‌పీవోల పనితీరు, రైతులకు జాతీయ బ్యాంకులు అందిస్తున్న సహకారం, రైతుల ఆర్థిక ఎదుగుదలకు వాణిజ్యపరమైన అవకాశాలు, స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాట్లు తదితర అంశాలపై నాబార్డు ఏజీఎం, వ్యవసాయ శాఖ అధికారి పరిశీలన చేసి నివేదికలు ఇవ్వాలన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్, ఎల్డీఎం జనార్ధనం, నాబార్డు ప్రతినిధులు, ఏపీఎంఐసీ పీడీ వెంకటేశ్వ రరెడ్డి, ఉద్యానశాఖ డీడీ సతీశ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

అన్‌క్లెయిమ్ ఆస్తులపై ప్రత్యేక శిబిరాలు

దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్న అన్‌క్లెయిమ్ ఆస్తులపై ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలులో ఎల్డీఎం జనార్ధనం తో కలిసి అన్‌లైన్ క్లెయిమ్స్ ఆస్తులపై కలెక్టర్ ప్రత్యేక శిబిరాలకు సంబంధించి వాల్‌పోస్ట ర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీ పాత అకౌంట్స్‌లో ఉన్న డబ్బులను తిరిగి పొందడానికి ఆర్బీఐ సహాయ పడుతోందన్నారు.

మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులకు అస్వస్థత

● కడుపునొప్పి, వాంతులతో ఆస్పత్రిలో చేరిన విద్యార్థులు



ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలోని అత్యవసర వార్డులో చికిత్స పొందుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వసం తపేట మున్సిపల్ హైస్కూలులో విద్యార్థులు తిన్న మధ్యాహ్న భో జనం ఫుడ్‌పాయిజన్ కావడంతో పలువురు అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం మధ్యా హ్నం 12.15 గంటలకు మొదట 6వ తరగతి విద్యార్థులకు మధ్యా హ్న భోజనం వడ్డించారు. విద్యా ర్థులు పప్పు వాసన వస్తోందని చెప్పడంతో భోజనం వడ్డించ కుండా నిలిపివేశారు. అప్పటికే భోజనం తిన్న విద్యార్థులు కొందరు అస్వస్థ తకు గురయ్యారు. మరికొందరు కడుపునొ ప్పి, వాంతులతో ఇబ్బంది పడ్డారు. అస్వస్థత కు గురైన విద్యార్థులను పాఠశాల ప్రధానో పాధ్యాయుడు గురప్ప ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చి కిత్స అందించారు. పురుగు పట్టకుండా కలి పిన రసాయనాలను సక్రమంగా తొలగించ కుండా పప్పును వండడంతో విద్యార్థులు అ స్వస్థతకు గురైనట్లు పేర్కొంటున్నారు. పప్పు లో నాప్తాలిన్ గుళికల వాసన వస్తోందని కొందరు, ఎలుక చనిపోయిన వాసన వ స్తోందని మరికొందరు విద్యార్థులు అధికారు లతో పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం తిని నలతగా ఉన్న కొందరు విద్యార్థులు ఇండ్లకు వెళ్లారు. ఇంటికి వెళ్లాక కడుపునొప్పి, వాం తులతో ఇబ్బంది పడుతుండడంతో వారిని తల్లిదండ్రులు ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లా రు. కాగా.. ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను డీఈవో షంషుద్దీన్, డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, తహ శీల్దారు గంగయ్య పరామర్శించారు. మెరుగై న వైద్యం అందించాలని వైద్యులకు సూచిం చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొం డారెడ్డి, ఆ పార్టీ నాయకులు బచ్చల ప్రతా ప్, తలారి పుల్లయ్య విద్యార్థులను పరామ ర్శించారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ బంగా రురెడ్డి, ఖాజాలు విద్యార్థులను పరామ ర్శించి ధైర్యం చెప్పారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి

వంట ఏజెన్సీ తొలగింపు

విద్యార్థుల ఫుడ్‌పాయిజన్‌కు కారణమైన చౌడేశ్వరీ వంట ఏజెన్సీని తొలగిస్తూ అధి కారులు ఆదేశాలు జారీ చేశారు. వంట ఏజెన్సీ నిర్వాహకుడు బాలకృష్ణ 29వ వార్డు కౌన్సిలర్ భర్త. పాఠశాలలో 18-20 సంవత్సరాలుగా వంట ఏజెన్సీ ని ర్వహిస్తున్నారు. వంట ఏజెన్సీపై అనేక విమర్శలున్నాయి. గతంలో విద్యార్థులు ఉడకని అన్నం, ఉడకని గుడ్లు పెడుతు న్నారని ఆందోళన చేశారు. వంట ఏజె న్సీ నిర్వాహకునికి రాజకీయ ప్రాబల్యం ఉండడంతో వంట వండడంలో ఇష్టం వచ్చినట్లు వ్యవహరించేవాడని, విద్యా ర్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.

గుప్తనిధుల పేరుతో..

● రైతులు, అమాయక ప్రజలే టార్గెట్ ● రూ.కోట్లు ఆశ లక్షలు స్వాహా



ఆభరణాలు చోరీకి గురైన రాజుపాలెం పల్నాడు అంకాలమ్మ తల్లి ఆలయం (ఫైల్‌ఫొటో)

బి.కోడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుప్తనిధుల తవ్వకాల పేరుతో కొన్ని బ్యాచ్‌లు చెలరేగి పోతున్నాయి. అమాయకులకు ఒకటికి పదింతలు డబ్బు వస్తుందని ఆశ చూపి వచ్చినకాడికి దోచుకుంటున్నారు. ముఖ్యంగా పోరుమామిళ్ల పట్టణంలోని బస్టాండుకు సమీపాన ఓ ప్రధాన లాడ్జి వద్ద గుప్తనిధుల బ్యాచ్ మకాం వేస్తోంది. అలాగే బద్వేలు పట్టణంలోని ఎన్జీవో హోం, నాలుగు రోడ్ల కూడలిలో ఓ ముఠా తిరుగుతోంది. వారి చేతుల్లో రైతులు, అమాయక ప్రజలు మోసపోతుండటంతో ప్రశాంతంగా ఉన్న కుటుంబాలు వీధిపాలవుతున్నాయి.

ఎరువులకోసం వచ్చే రైతులకు ఎర

ఎరువులు, వివిధ పనులకోసం పట్టణాలకు వచ్చే రైతులను గుప్తనిధుల బ్యాచ్ టార్గెట్ చేసుకుంటుంది. రైతులతో మాటలు కలిపి.. "మొన్న ఒక తోటలో బంగారు చెరవ లేసింది.. సాధువును తీసుకొచ్చి శాంతి పూజలు చేయిస్తే మొత్తం దక్కుతుంది. ఎంత లేదన్నా రెండు కేజీల బంగారు ఉంటుంది. అంటే రెండు కోట్లకు పైగా చేస్తాది. పూజలకు కనీసం రూ.10లక్షలు కావాల. మేము ఆరుమంది ఉండాం. తలా ఒక లక్ష వేసుకున్నాం. ఇంకో నాలుగు లక్షలు కావాల. రూ.లక్ష ఇచ్చినావంటే ఇరవై లక్షలు వస్తుంది" అని మాటలతో బురిడీ కొట్టిస్తారు. వీరి మాటలు నమ్మి కనీసం రూ.50వేలు ఇచ్చిన వారున్నారు. మరికొందరు రూ.80 లక్షలు వస్తుందనే ఆశతో అప్పులు చేసి రూ.4లక్షలు ఇచ్చి మోసపోయిన వారూ ఉన్నారు.

పొలాలన్నీ అమ్మినా తీరనంత అప్పు

బి.కోడూరు మండలంలో మేకవారిపల్లె, ప్రభలవీడు, తుమ్మలపల్లె, బి.కోడూరు, పాయలకుంట్ల, ఐత్రంపేట, సిరిగిరిపల్లె, తూపల్లె, టమటంవారిపల్లె, మున్నెల్లి తదితర గ్రామాల్లోని పలువురు రైతులు, అమాయక ప్రజలు ఇప్పటికే గుప్తనిధుల వేటగాళ్ల బారిన పడి లక్షలాది రూపాయలు అప్పుల పాలయ్యారు. ఎంతగా అంటే ఇప్పుడు పొలాలు, ఇళ్లు అమ్మినా ఆ అప్పులు తీరే పరిస్థితి లేదు. ఒకప్పుడు వ్యవ సాయం చేసుకుంటూ సంసారాన్ని గుట్టుగా నెట్టుకొస్తున్న కుటుంబాలు ఇప్పుడు వీధిపాలు అవుతుండడంతో మండలమంతా చర్చనీయాంశమైంది.

సాధువుల షెల్టర్ గోపవరం

గుప్తనిధుల బ్యాచ్‌కు గోపవరం మండలంలోని ఓ ప్రముఖ లాయరు గుమస్తా తోట అడ్డా. ప్లానింగ్, ఏరియల్ సర్వే, ఎక్కడ గుప్తనిధులున్నాయో తేల్చే సాధువులు ఇక్కడే మకాం వేస్తారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన సాధువులకు సకల సౌకర్యాలు అన్నీ ఏర్పాటు చేసేది ఆ గుమస్తానే అని బద్వేలు నియోజకవర్గం అంతా ప్రచారం సాగుతోంది. నియోజకవర్గ వ్యాప్తంగా గుప్తనిధుల బ్యాచ్‌లకు ఆయనే బాస్. వారి వద్ద అన్ని సమాచారాలు, సెల్‌నెంబర్లు ఉంటాయి. ఇక్కడ గుప్తనిధులు లేపుతున్నాం, ఖర్చులకు కావాలి అంటూ రైతులను, అమాయక ప్రజలను మోసం చేస్తూ వారి వద్ద నుంచి దండుకున్న డబ్బుల్లో కొంత ఇక్కడికి చేరుతుంటుందని ప్రచారం సాగుతోంది.

గుళ్లు, ఇళ్లలో చోరీలు వీరి పనేనా

బి.కోడూరు మండలంలో మూడు సంవ త్సరాల నుంచి గుళ్లు, గోపురాలు, ఇళ్లల్లో చోరీలు జరుగుతూనే ఉన్నాయి. అప్పట్లో మున్నెల్లి శివాలయంలో నంది విగ్రహం చోరీకి గురైంది. నల్లగొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో రూ.14 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, హుండీ, రాజుపాలెం గ్రామంలోని పల్నాడు అంకా లమ్మ తల్లి దేవాలయంలో రూ.8 లక్షల విలువచేసే ఆభరణాలు, గోపురం కలశం చెంబు, పాయలకుంట్ల గ్రామంలోని రామాల యంలో బంగారు ఆభరణాలు, అభయాంజ నేయస్వామి గుడిలో హుండీ చోరీ అయ్యాయి. పాయలకుంట్లలోనే దాదాపు 15 ఇళ్లల్లో చోరీలు జరిగాయి. పాతప్రభలవీడు గ్రామంలోని పురాతన దేవాలయంలో, అంకన గొడుగునూరులో భైరవతల్లి విగ్రహం వద్ద తవ్వకాలు జరిగాయి. ఇదంతా గుప్తనిధుల తవ్వకాల బ్యాచ్ పనేనని మండలమంతా చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు వీరిపై నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయమై బద్వేలు సీఐ క్రిష్ణయ్యను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, గుప్తనిధుల బ్యాచ్ తిరుగుతున్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు. అలాంటి వారు ఎవరైనా ఉన్నట్టు తెలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. తెలిసీ తెలియని అమాయక ప్రజలు వారి ట్రాప్‌లో పడి కుటుంబాలను నాశనం చేసుకోవద్దన్నారు.

1న మెగా జాబ్‌మేళా : కలెక్టర్



మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో జిల్లాలోని రాయచోటి పట్టణం శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉద్యోగ మేళాలో దాదాపు 25 కంపెనీలు పాల్గొంటున్నాయని, జిల్లా లోని ఆసక్తి ఉన్న యువతీ యువకులు హెచ్‌టీటీపీఎస్:// జేవోబీఎం ఈఎల్‌ఏ.ఎంఈపీఎంఏపీ. సీవోఎం. లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసు కోవాలని తెలిపారు. వివరాలకు 7901610271, 7901610276, 79016 10324 సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ లక్ష్మిదేవి, రాయచోటి, మదనపల్లె, రాజంపేట మెప్మా సిబ్బంది, జిల్లా ఐబీ స్పెషలిస్ట్ నాగరాజు పాల్గొన్నారు.

13 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

మదనపల్లెటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను, వర్షాల నేపథ్యంలో మదనపల్లె డివిజన్‌లో 13 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా ప్రజలు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వాటిని ఆయా మండలాల పరిధిలోని కంట్రోల్‌రూమ్‌లకు సమాచారం ఇచ్చి సహాయం పొందాలని కోరారు. కంట్రోల్ రూమ్‌ల ఫోన్ నెంబరు.... మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం 08571-231181, మదనపల్లె మండల కార్యాలయం 9121511504, మదనపల్లె మున్సిపల్ కార్యాలయం 08571-222280, నిమ్మనపల్లె 9966206757, రామసముద్రం 9676857690, వాల్మీకిపురం 9866046879, ములకలచెరువు 98669 48533, బి.కొత్తకోట 9550667096, పెద్దతిప్పసముద్రం 9491675670, కలికిరి 9441219987, తంబళ్లపల్లె 7989833068, పెద్దమండ్యం 9491077058, కురబలకోట కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 96667 61520కు ఫోన్ చేసి సహాయం పొందాలని కోరారు.

ఉపాధి కూలీలను పెంచడంలో ఎఫ్‌ఏలదే కీలక పాత్ర : పీడీ



ఉపాధిహామీ పథకం సిబ్బందికి సూచనలిస్తున్న పీడీ

మదనపల్లెటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకంలో కూలీలను పెంచడంలో ఫీల్డ్ అసిస్టెంట్లదే కీలక పాత్ర అని డ్వామా పీడీ వెంకటరత్నం అన్నారు. శుక్రవారం స్థానిక సీఎల్‌ఆర్‌సీ భవనంలో తంబళ్లపల్లె క్లస్టర్‌తో పాటు మదనపల్లె మండలానికి చెందిన ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జిల్లాలో 25 వేల మంది ఉపాధి శ్రామికులు పనిచేయాలనేది లక్ష్యంగా చేసుకున్నామని, అన్ని మండలాల్లో కలిపితే 374 మంది ఎఫ్‌ఏలు వున్నారని, వీరందరికి లక్ష్యాలను నిర్దేశించామన్నారు. ప్రతి మండలంలో ఉపాధి కూలీలకు పని కల్పించడంలో విఫలమైన ముగ్గురు చొప్పున ఫీల్డ్ అసిస్టెంట్లను గుర్తించి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. అయినా వారి పని తీరు మెరుగుపరచుకోకుంటే వారిపై చర్యలు వుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ నందకుమార్‌రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలల సమస్యలు పరిష్కరించండి

- ప్రైవేటు విద్యాసంస్థల రాష్ట్ర జేఏసీ కన్వీనర్



మంత్రి సత్యకుమార్‌ను కలిసి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ నేతలు

రాయచోటిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు నర్సింగ్ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రైవేటు విద్యాసంస్థల జేఏసీ, ప్రైవేటు నర్సింగ్ కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను విజయవాడలోని సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ డాక్టర్ పాపిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, ప్రైవేటు నర్సింగ్ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నారెడ్డి, కార్యదర్శి ప్రభుదాస్, ఆర్థిక కార్యదర్శి నాగరాజు, నాయకులు కేఎస్ఆర్ విజయ్‌కుమార్ తదితరులు మంత్రికి సమస్యలను విన్నవించారు. బీఎస్సీ నర్సింగ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున సీట్లు ఖాళీగా మిగిలిపోయాయని, కళాశాలలు నష్టాలబారిన పడకుండా స్పాట్ అడ్మిషన్స్, మేనేజ్‌మెంట్ కోటా ద్వారా ఇంటర్మీడియట్ అర్హత ఆధారంగా భర్తీ చేసుకునేందుకు వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో నర్సింగ్ విద్యా వ్యవస్థను కాపాడాలంటే ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని ప్రతినిధులు స్పష్టం చేశారు.

అటల్ ప్రయోగశాలలను సమర్థవంతంగా నిర్వహించండి

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అటల్ టింకరింగ్ ప్రయోగశాలలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి నాగయ్య ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. రాయచోటి పట్టణం మాసాపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన అటల్ వర్క్‌షాప్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. అటల్ ల్యాబ్‌లను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ వర్క్‌షాప్ నిర్వహించామని తెలిపారు. ఉపాధ్యాయులు ఇక్కడ పొందిన నైపుణ్యాలను తమ ప్రయోగశాలలో విద్యార్థులకు అందించాలని సూచించారు. అటల్ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు కోడింగ్, 3డీ ప్రింటింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్ వంటి అంశాలను తప్పనిసరిగా నేర్పాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు వర్క్‌షాప్ హాజరు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్‌బాబు, రీసోర్స్ టీచర్లు అజయ్, సాయి, వేణుగోపాల్‌రెడ్డి, ఆంజనేయులు, హేమంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉపవిద్యాశాఖ అధికారి

సమస్యల లోగిళ్లు.. సంక్షేమ హాస్టళ్లు

- చలి, దోమల బెడదతో విద్యార్థుల ఇక్కట్లు
- కనీస వసతులు కరువు
- పట్టించుకోని సంక్షేమశాఖ అధికారులు

రాయచోటిటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్స్ సమస్యలకు లోగిళ్లగా మారాయి. వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు ఒక పక్క దోమల బెడద, మరోపక్క చలికి గజ గజ వణుకిపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా చాలా వసతి గృహాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. పాలకులు మారినా వసతి గృహాల్లో తీరు మారలేదని విద్యార్థులు, తల్లి దండ్రులు ఆందోళన చెందుతున్నారు.

పేద విద్యార్థులకు మెరుగైన వసతితో కూడిన విద్యను, నాణ్యమైన భోజనాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పట్టణ, మండల ప్రాంతాల్లో వసతి గృహాలను ఏర్పాటు చేసింది. మారుమూల గ్రామాలకు చెందిన పేద విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ చదువుకునే వెలుసుబాటును కల్పించింది. అయితే పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వస్తోంది. దీనికి తోడు రోజురోజుకు రెసిడెన్షియల్ విద్యకు ప్రాధాన్యతను ఇచ్చి వసతి గృహాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో



ఏడు సంవత్సరాలుగా పూర్తి గాని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనం

జిల్లాలో పేద విద్యార్థులు ఉంటున్న ప్రభుత్వ వసతి గృహాల్లో కనీసం మౌలిక వసతులు కరువయ్యాయి. ఫలితంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టల్స్‌లో ఉంటున్న పేద విద్యార్థులు పలు రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పడంలో సందేహం లేదు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఎస్సీ సంక్షేమశాఖలో 55 వసతి గృహాలు ఉండగా అందులో సుమారు 4500 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 6 హాస్టల్స్ అద్దె భవనాల్లో, మిగిలిన వసతి గృహాలు సొంత భవనాల్లో నడుస్తున్నాయి. ఇటీవల కాలంలో మదనపల్లె, పీలేరు, రాయచోటి ప్రాంతాల్లో హాస్టళ్లకు మరమ్మతు చేపట్టారు. ముఖ్యంగా రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి నియోజకవర్గంలోని చిన్నమండెం ప్రాంతాల్లో చిన్న చిన్న పనులను ప్రారంభిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే జిల్లాలో గిరిజన సంక్షేమ వసతి గృహాలు 12 ఉన్నాయి. ఇందులో 2 హాస్టల్స్ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అలాగే జిల్లా వ్యాప్తంగా బీసీ సంక్షేమ వసతి గృహాలు 48 ఉండగా మొత్తం 3200 మంది విద్యార్థులు ఉన్నారు.



శిథిలావస్థలో ఉన్న రాయచోటిలోని ఎస్సీ హాస్టల్-1 భవనం

కనీస వసతులు కరువు

రాజంపేట గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రహరీ గోడ లేదు. దీంతో పాటు మరిన్ని గృహాలకు ప్రహరీగోడ లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. రాజంపేట ఇంటిగ్రేటెడ్ గిరిజన బాలికల హాస్టల్ అద్దె భవనంలో నడుస్తోంది. ప్రభుత్వ భవనాలతో పాటు అద్దె భవనాల్లో కూడా ఎంతోకాలంగా విద్యార్థులకు సవాలక్ష సమస్యలు వెంటాడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. అలాగే జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని బీసీ హాస్టల్, సుండుపల్లె రోడ్డులోని ఆర్ఆర్ కల్యాణ మండపం ఎదురుగా గతంలో సొంత భవనం ఉండేది. అయితే ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవనం కోసం టెండర్లు పిలిచి భవనాన్ని ప్రారంభించారు. అయితే నూతన ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవన నిర్మాణం పనులు ప్రారంభించి సుమారు 7 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఆ భవన నిర్మాణ పనులు పూర్తికాకుండా ఆగిపోయాయి. అదేవిధంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న ఎస్టీ బాలికల వసతి గృహం మరమ్మతులు చేపట్టకపోవడంతో వర్షాలు పడితే స్లాబ్ నుంచి నీరు కారుతోంది. వంట గది కూడా పూర్తిగా తడిసిపోయి పై నుంచి పెచ్చులు పడుతున్నాయని విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వసతి గృహాల సదుపాయాల కోసం బడ్జెట్ కేటాయించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

- లవకుమార్, ఏఐఎస్ఏ
ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ సంక్షేమశాఖలో చదువుతున్న విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైంది. జిల్లా వ్యాప్తంగా కేజీబీవీలు, రెసిడెన్సీలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న పేద, బడుగు, బలహీన విద్యార్థులు పౌష్టికాహార లోపంతో బాధపడుతూ తీవ్రమైన రక్తహీనత సమస్య ఎదుర్కొంటున్నారు. ఇలాంటి వాటిని వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని ప్రతి సంక్షేమ హాస్టల్స్, రెసిడెన్షియల్ హాస్టల్స్‌లో కూడా వైద్య పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు కావాల్సిన మందులను పంపిణీ చేయాలి.

రూ.50 లక్షలతో మరమ్మతు చేపట్టాం

- నాగేంద్రరాజు, బీసీ సంక్షేమశాఖ అధికారి

జిల్లా వ్యాప్తంగా 22 హాస్టల్స్‌లో రూ.50 లక్షలతో మరుగుదొడ్లు, తదితర వాటికి మరమ్మతులు చేపట్టాం. ఇంకా పూర్తి స్థాయి మరమ్మతుల కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు రూ.2 కోట్ల 66 లక్షలతో ప్రణాళికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాం. చలికాలం దృష్ట్యా ఇటీవల బెడ్‌షీట్లు కూడా పంపిణీ చేశాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో విద్యుదాఘాతం

- ముగ్గురు యువకులకు తీవ్రగాయాలు
- ఒకరి పరిస్థితి విషమం
- ట్రాన్స్‌కో అధికారులపై కేసు నమోదు



చేతికి అందేంత ఎత్తులో ఇంటి మీదున్న 11 కేవీ విద్యుత్ వైర్లు

కలికిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా జరిగిన విద్యుదాఘాతంతో ముగ్గురు యువకులు తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా వుంది. బాధితులు అందజేసిన ఫిర్యాదు మేరకు కలికిరి పోలీసులు ఇద్దరు ఉద్యోగులపై కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని మర్రికుంటపల్లె గ్రామంలో ఒక ఇంటి నిర్మాణం పూర్తయి 26న బుధవారం గృహ ప్రవేశం కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎ.నాగార్జున, ఉదయకుమార్, సిద్దయ్య అనే యువకులు విద్యుత్ షాకుతో తీవ్రగాయాలకు గురయ్యారు. వెంటనే గ్రామస్థులు ముగ్గురినీ స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి ఆసుపత్రిలో చేర్చారు. అందులో నాగార్జున పరిస్థితి విషమంగా తయారైంది. మరో ఇద్దరు యువకులు కోలుకుంటున్నారు. ఈ క్రమంలో విద్యుత్ శాఖ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరి గిందని పేర్కొంటూ నాగార్జున తండ్రి వీరభద్రయ్య 27న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపైన సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు సమంజసంగా భావించి మర్రికుంటపల్లె లైన్‌మెన్ పూజారి గోపి (ఏ1), ఏఈ ముజిబుర్ రెహ్మాన్ (ఏ2)లపై ఏఎస్ఐ మహబూబ్ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై విచారణ

- రాతపరీక్ష నిర్వహించి మరీ వివరాల సేకరణ



విద్యార్థులకు రాతపరీక్ష నిర్వహిస్తున్న అధికారులు

బి.కొత్తకోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరాపురం జడ్పీ హైస్కూల్‌లో పదవతరగతి చదువుతున్న జానకీరాణి(15) అనే విద్యార్థిని గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయడం, ఆ బాలికను మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించడం తెలిసిందే. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు దూషించడం, తరగతి బయట నిలబెట్టి అవమానించడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసినట్లు ప్రచారం జరగడంతో ఉన్నతాధికారులు విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. అప్పటికప్పుడు బాలిక పరిస్థితిపై ఆరా తీసిన జిల్లా అధికారులు కిందిస్థాయి అధికారులకు పలు ఆదేశాలు, సూచనలు చేశారు. డీవైఈవో లోకేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఉదయాన్నే శంకరాపురం హైస్కూలుకు చేరుకొని జానకీరాణి ఘటనపై విచారణ చేపట్టారు. తదితర ప్రశ్నలతో కూడిన ప్రశ్నాపత్రాన్ని రూపొందించి తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులకు వేర్వేరుగా పరీక్ష నిర్వహించి అభిప్రాయాలను రాబట్టారు. అనంతరం విద్యార్థులను విడివిడిగా ప్రశ్నించారు. ఈ విషయమై డీవైఈవో లోకేశ్వరరెడ్డి మాట్లాడుతూ తుది నివేదికను జిల్లా అధికారులకు అందిస్తామన్నారు. చిన్నపాటి విషయాలకే విద్యార్థులు ఇలాంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవడం సరికాదని, కుటుంబాల గురించి ఆలోచించాలన్నారు. కాగా చికిత్స అనంతరం జానకీరాణి ప్రాణాపాయం నుంచి బయటపడడంతో కుంటుంబీకులు, ఉపాధ్యాయులు ఊపిరిపీల్చుకున్నారు. విచారణలో బి.కొత్తకోట ఎంఈవోలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారి, హెచ్‌ఎం మునిస్వామి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న మండల టీడీపీ అధ్యక్షుడు షాబుద్దీన్

కలికిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు కలికిరిలో ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన దాదాపు 500 మంది విద్యార్థులు అండర్-14 విభాగంలో అర్హత సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరయ్యారు. కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మూడు రోజులపాటు నిర్వహించే ఈ పోటీలను శుక్రవారం ఎంపీటీసీ రెడ్డివారి గాయత్రి, టీడీపీ మండల అధ్యక్షుడు కేఎస్ షాబుద్దీన్ ప్రారంభించారు. ఈ పోటీల్లో అర్హత సాధించే విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారు. మొదటి రోజు పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో కృష్ణా జిల్లా జట్టుపై చిత్తూరు జిల్లా జట్టు, బాలికల విభాగంలో అనంతపురం జట్టుపై చిత్తూరు జట్టు గెలుపొందాయి. పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగేష్‌రెడ్డి క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో మదనపల్లె డీవైఈవో లోకేశ్వర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఝాన్సీ, హ్యాండ్‌బాల్ పోటీల రాష్ట్ర పరిశీలకుడు వెంకటేశ్వరరావు, ఎంఈవో సురేశ్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు శివ, రమేష్ బాబు, ఉషారాణి, కరణానిధి, చంద్రమౌళి, చిన్నప్ప, రెడ్డివరప్రసాద్, కలికిరి హెచ్‌ఎం నటరాజన్, ఇతర హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం

- సబ్‌కలెక్టర్ సమక్షంలో మెజారిటీ సభ్యుల నిర్ణయం



అవిశ్వాసాన్ని నమోదు చేయిస్తున్న సబ్‌కలెక్టర్

మదనపల్లెటౌన్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కురవంక గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌పై వార్డు సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రకటించారు. శుక్రవారం కురవంక గ్రామ సచివాలయంలో సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఆధ్వర్యంలో వార్డు సభ్యులు సమావేశం నిర్వహించారు. ఇది వరకే మెజారిటీ వార్డు సభ్యులు ఉప సర్పంచ్ భైగారి భారతిపై అవిశ్వాసం ప్రకటిస్తూ సబ్‌కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా పత్రాన్ని ఇచ్చారు. ఈ క్రమంలో అందరికీ నోటీసులు పంపిన సబ్‌కలెక్టర్ వార్డు సభ్యుల సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలో మొత్తం 12 మంది వుండగా అందులో 9 మంది వార్డు సభ్యులు అవిశ్వాసం తీసుకొస్తూ చేతులెత్తారు. వీరికి మద్దతుగా సర్పంచ్ చలపతి కూడా సంతకాలు చేశారు. దీంతో అవిశ్వాసానికి మెజారిటీ దక్కడంతో భైరాగి భారతి పదవిని వదులుకోక తప్పలేదు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ మెజారిటీ వార్డు సభ్యుల నిర్ణయాన్ని పంచాయతీరాజ్ కమిషనర్‌కు పంపుతామని, అక్కడి నుంచి వచ్చే ఉత్తర్వులను అమలు పరుస్తామన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో తాజ్‌మస్రూర్, పంచాయతీ కార్యదర్శులు పవన్‌కుమార్, గిరిధర్‌నాయక్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



రవీంద్ర (ఫైల్‌ఫోటో)

కలకడ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కలకడ-గుర్రంకొండ మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు రవీంద్ర (21) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హెచ్‌సీ అబ్దుల్‌ముజీర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. కలకడ పంచాయతీ కొత్తపల్లి వాసి రాంబాబు కుమారుడు రవీంద్ర (21), అత్త కుమారుడు రూపేష్ (20)తో కలిసి గురువారం రాత్రి ఇంటి సరుకుల కోసం గోపాలపురానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా బొలెరో వాహనం ఢీకొందన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇరువురిని మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు తిరుపతికి తరలించగా అక్కడి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రవీంద్ర శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. అపస్మారక స్థితిలో రూపేష్ చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మృతుడి తండ్రి రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో విద్యార్థుల విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్‌డీవో

రాయచోటి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 69వ ఎస్‌జీఎఫ్ అండర్-17 బాల, బాలికల ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో జిల్లా పరిధిలోని గుర్రంకొండకు చెందిన విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచారు. వ్యక్తిగత ఈవెంట్స్‌లో గుర్రంకొండ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.హరినాథ్‌రెడ్డి సిల్వర్, ప్రసన్నకుమార్ బ్రాంజ్, గుర్రంకొండ ఏపీఆర్‌ఎస్ విద్యార్థిని డి.నికిత బ్రాంజ్ మెడల్ సాధించారు. టీం అండ్ యూనియన్ ఈవెంట్స్‌లో పి.మానస, పి.గాయత్రి బ్రాంజ్ మెడల్, కె.చందు సిల్వర్ మెడల్ సాధించారు. వీరంతా మహా రాష్ట్రలోని శంభోషంనగర్‌లో జరగబోయే జాతీయ స్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నారు. రాయచోటి పట్టణంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో శుక్రవారం డీఎస్డీవో చంద్ర శేఖర్ వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఖేలో ఇండియా ఫెన్సింగ్‌కోచ్ రవీంద్రనాథ్, సీనియర్ అసిస్టెంట్ మస్తాన్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెనగలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయకురాలి పోస్టులకు అర్హులైన స్థానిక మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఐసీడీఎస్ పెనగలూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయకుమారి తెలిపారు. ఇండ్లూరు-1 కేంద్రంలో బీసీ-సీ కేటగిరి, ఔస్తపల్లెలో ఓసీ, తిరుమల రాజుపేట ఎస్సీ, కొత్తదామరచర్ల ఓసీ, ఆర్.అప్పారావుపేట ఓసీ మహిళలకు కేటాయించారని, 10వ తరగతి పాసైనవారికి మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు.


జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ సుమిత్ర

గుర్రంకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు గుర్రంకొండ జడ్పీ హైస్కూల్, బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుమిత్ర తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రాష్ట్రస్థాయిలో అండర్-17 బాలబాలికల విభాగంలో ఫెన్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గుర్రంకొండ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు నికిత సేబర్, చందు, గాయత్రి, మానస సిల్వర్ మెడల్, అలాగే బాలుర విభాగంలో జడ్పీ హైస్కూల్ విద్యార్థులు హరినాథ్‌రెడ్డి, ప్రసన్నకుమార్, దిలీప్ స్విలర్ మెడల్‌ను సాధించినట్లు ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ రవీంద్రనాథ్ తెలిపారు. వీరు మహారాష్ట్రలోని శంభోశంనగర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

ప్రతి కేంద్రంలోనూ 'రైతన్నా మీకోసం'



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ

రామాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతిరైతు సేవా కేంద్రంలోనూ రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ అన్నారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని చిట్లూరు గ్రామంలోని ప్రతి రైతు కుటుంబాన్ని సందర్శించి వ్యవసాయ, అనుబంధశాఖల ద్వారా ప్రతి స్కీమ్‌ను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు పద్ధతుల్లో తీసుకోవాల్సిన చర్యలను రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించుటకు, అధిక దిగుబడులు సాధించుటకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమణి, రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హ్యాట్సాఫ్.. మాస్టార్



విద్యార్థులకు పద్యాలు నేర్పిస్తున్న హయత్‌బాషా

- మాతృభాషపై మమకారంతో...
- గణితంలో ట్రిక్స్ నేర్పుతూ..
- ఆకట్టుకుంటున్న హయత్ బాషా బోధన
- ట్విట్టర్ (ఎక్స్) వేదికగా మంత్రి లోకేశ్ ప్రశంసలు

హయత్‌బాషా మాస్టారికి తెలుగుభాషపై ఉన్న అభిమానం అపురూపం. దానిని పిల్లలకు నేర్పించే విధానం అందరినీ ఆకర్షిస్తోంది. చిన్ననాటి నుంచే మాతృభాషపై మమకారాన్ని పెంచేలా ఆయన విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. అలాగే గణితంలో విద్యార్థులకు భయాన్ని పోగొడుతూ సులభరీతిలో అర్థమయ్యేలా బోధన సాగిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.



సర్వశిక్షా అభియాన్ డైరెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న హయత్‌బాషా

కొండాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లప్రొద్దుటూరు మోడల్ ప్రైమరీ స్కూల్‌లో సెకండరీ గ్రేడు టీచరుగా పనిచేస్తున్న హెచ్.ఎస్ హయత్‌భాషా వినూత్న పద్ధతులలో విద్యాబోధన సాగిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. కేవలం రెగ్యులర్ సబెక్టులకే పరిమితం కాకుండా, ఆయన తెలుగు భాష, నైతిక విలువలు, గణితంలో ఉపయోగిస్తున్న ప్రత్యేక పద్ధతులు విద్యార్థుల భవిష్యత్‌కు బలమైన పునాదులు వేస్తున్నాయి. ఈ మస్టారి కృషిని గుర్తించిన రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారాలోకేశ్ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా శుక్రవారం అభినందనలు తెలిపారు.

samagraap భాషా మాస్టారి తెలుగు భాషాభిమానం చూస్తే ముచ్చటేస్తోంది. పద్యాలు,పదాలు, గేయాలు చూడకుండా అప్పజెప్పేలా పిల్లలను తయారుచేసిన వైయస్ఆర్ కడప జిల్లా, కొండాపురం మండలం, తాళ్ళ ప్రొద్దుటూరు మోడల్ ప్రైమరీ స్కూలులో సెకండరీ గ్రేడ్ టీచరుగా విధులు నిర్వర్తిస్తున్న హయత్ భాషా గారికి అభినందనలు. రెగ్యులర్ సబ్జెక్టులతోపాటు తెలుగు భాషపై అభిమానంతో బోధిస్తున్న తీరు చాలా బాగుంది. వేమన పద్యాలు, సుమతి శతకాల ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు చేస్తున్న కృషి ప్రశంసనీయం. విద్యార్థులతో మేథ్స్ పజిల్స్ చేయిస్తూ, Maths made easy with "Tricks" నేర్పిస్తున్న హయత్ భాషా మాస్టారి బోధనా తీరు స్ఫూర్తి నింపుతోంది.

...నారా లోకేష్,
విద్య, ఐటీ శాఖల మంత్రి. less

మంత్రి లోకేశ్ అభినందనలు

హయత్‌బాషా స్ఫూర్తిదాయకమైన బోధన తీరును గుర్తించిన మంత్రి నారా లోకేశ్ తన ట్వీట్‌లో ' బాషా మాస్టారి తెలుగుభాషాభిమానం చూస్తే మచ్చటేస్తోంది..ఆయన బోధనా తీరు స్ఫూర్తి నింపుతోంది' అని పేర్కొన్నారు. వేమన, సుమతి శతకాల ద్వారా నైతిక విలువలు పొంపొందించే కృషిని , ట్రిక్స్ ద్వారా మ్యాథ్స్ నేర్పుతున్నందుకు ప్రత్యేకంగా ప్రశంసించారు.

జ్ఞాపకశక్తికి పదును

పద్యాలు, పదాలు, గేయాలను ఎక్కడా చూడకుండా ధారాళంగా అప్పజెప్పేలా విద్యార్థులను ఆయన తీర్చిదిద్దారు. ఈ పాఠశాలలో ఐదవ తరగతికి చెందిన నలుగురు విద్యార్థులు 100 వేమన, సుమతి పద్యాలను చూడకుండా ధారళంగా చెబుతున్నారు. మిగిలిన విద్యార్థులు కూడా ఎక్కువ పద్యాలను అలవోకగా చెబుతారు. ఇది ఆయన బోధనకు నిదర్శనం. ఇది విద్యార్థుల జాపకశక్తిని, ఉచ్చారణ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందనడంలో అతిశయోక్తి కాదు.

నైతిక విలువలకు ప్రాధాన్యం

విద్యార్థుల్లో క్రమశిక్షణ, మంచి నడవడిక పెంపొందించడానికి ఆయన వేమన పద్యాలు, సుమతి శతకాలను బోధనాంశంలో భాగం చేశారు. కేవలం అక్షరజ్ఞానమే కాకుండా, జీవిత పాఠాలను నేర్పడానికి చేస్తున్న కృషి సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది.

గణితంలో ట్రిక్స్ నేర్పుతూ....

మాస్టారు కేవలం తెలుగు భాషకే పరిమితం కాలేదు. విద్యార్థులకు కష్టం అనిపించే గణితాన్ని సులభతరం చేశారు. తరచూ విద్యార్థులకు ప్రత్యేక ట్రిక్స్ , పజిల్స్ చేయిస్తూ గణితం పట్ల ఉన్న భయాన్ని దూరం చేస్తున్నారు. దీంతో విద్యార్థులు లెక్కలను భారంగా కాకుండా, ఒక సరదా అంశంగా భావిస్తున్నారు.



విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుంది.

చిన్నతనం నుంచే పిల్లలకు పద్యాలు నేర్పించడం ద్వారా వారిలో సృజనాత్మకత పెరుగుతుంది. నైతిక విలువలు పెరుగుతాయి. గణితంలో భయాన్ని పోగొట్టేందుకు ట్రిక్స్ ఎంతగానో ఉపయోగపడుతాయి. నా బోధనను గుర్తించిన మంత్రి నారాలోకేశ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

-హెచ్ఎస్ హయత్‌బాషా, సెకండరీ గ్రేడ్ టీచర్, మోడల్ ప్రైమరీ స్కూల్, తాళ్లప్రొద్దుటూరు.

సీనియార్టీ యథాతథంగా ఉంచాలి

- భూనిర్వాసిత ఉద్యోగులకు అన్యాయం జరిగితే సహించం
- ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావుకు వినతి



సీఈ వాసుదేవరావుకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

ఎర్రగుంట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కలమల్ల వద్ద నున్న డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీకి భూములు కోల్పోయి ఉద్యోగాలు పొందిన వారి సీనియార్టీ యథాతదంగా ఉంచాలని స్థానికులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజలతో కలిసి వారు శుక్రవారం ప్లాంట్ సీఈ వాసుదేవరావును కలిసి వినతిపత్రం ఇచ్చారు. 1988లో భూములు కోల్పోయి నిర్వాసితులైన వారికి 2013లో జీవో 98 ఇచ్చి 50శాతం ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. మిగిలిన 50శాతం రిక్రూట్‌మెంట్ ద్వారా నియమించింది. అప్పటి నుంచి భూనిర్వాసితులకు మొదటి ప్రాధాన్యతగా సీనియారిటీ అమల్లో ఉందన్నారు. అయితే తాజాగా సీనియారిటీ జాబితాను మార్పులు చేసి భూములు కోల్పోయిన ఉద్యోగుల సీనియారిటీని వెనక్కి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ విషయంలో భూనిర్వాసిత ఉద్యోగులకు అన్యాయం జరిగితే పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కలమల్ల, సున్నపురాళ్లపల్లెకు చెందిన కృష్ణబాబు, మణినాథ్‌రెడ్డి, ఐవీఎస్ఆర్, దంతం సుబ్బరామయ్య, ఎన్.తారకరామారెడ్డి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు పెంపు

కడప కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ల కాల పరిమితి ముగుస్తున్న నేపథ్యంలో కార్డుల గడువు మరో 2 నెలలు పెంచుతూ సమాచార పౌరసంబంధాలశాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. నవంబరు 30 వరకు అక్రిడిటేషన్లు గల జర్నలిస్టులకు డిసెంబరు 1 నుంచి వచ్చే ఏడాది జనవరి 31 వరకు లేదా నూతన అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసే వరకు ఉత్తర్వులు అమలులో ఉంటాయన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, డీఎంసీ చైర్మన్ శ్రీధర్ చెరుకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అక్రిడిటేషన్లు కలిగిన సంబంధిత యాజమాన్యాలు ప్రస్తుతం పనిచేస్తున్న జర్నలిస్టుల జాబితాను సమాచార పౌరసంబంధాలశాఖ కార్యాలయంలో అందజేసి పొడిగింపు స్టిక్కర్లను పొందాలని కలెక్టర్ పేర్కొన్నారు.

చోరీ కేసులో ఐదుగురు అరెస్టు

రూ.70వేలు విలువ చేసే కాపర్ వైర్లు, బ్యాటరీలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న కడప వన్‌టౌన్ సీఐ చిన్నపెద్దయ్య

కడప క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పాత బస్టాండు సమీపంలోని విశ్వం థియేటరులో కరెంటు వైర్లు, మోటర్లు చోరీ చేసిన కేసులో ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి కడప వన్‌టౌన్ సీఐ చిన్నపెద్దన్న వివరాలు తెలిపారు. కడప నగరానికి చెందిన షేక్ తబ్రీష్, షేక్ ఉమర్, షేక్ సద్దాంహుసేన్, షేక్ ముర్షత్‌ఖాన్, షేక్ గౌస్‌పీర్‌లు ఒక బ్యాచ్‌గా తయారయ్యారు. గత నెల వీరంతా కలిసి విశ్వం థియేటరులోని కాపర్‌వైర్లు, బ్యాటరీలు చోరీ చేశారని తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన నిందితులు శుక్రవారం గుర్రాలగడ్డ వద్ద ఉండగా వన్‌టౌన్ ఎస్ఐ ప్రతాప్ రెడ్డి సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.70వేలు విలువ చేసే కాపర్‌వైరు, రెండు బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిని రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

9 మంది జూదరుల అరెస్టు

ప్రొద్దుటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం వివేకానంద క్లాత్‌మార్కెట్ వెనుక కంపచెట్లలో జూదం ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ సదాశివయ్య, ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి తెలిపారు. పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్‌లో పట్టుబడిన జూదరులను చూపెట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రకాష్ నగర్‌కు చెందిన 9మంది జూదరులు పేకాట ఆడుతుండగా పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.84వేల నగదు, 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై గ్యాంబ్లిం గ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కోడిపుంజును మింగిన కొండచిలువ



కొండాపురం, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): స్థానిక సీఆంఆర్ కాలనీలో గురువారం కొండ చిలువ కలకలం రేపింది. స్థానికంగా ఇళ్ల వద్ద ఉన్న కోడిపుంజును పట్టుకొని మింగుతుండగా స్థానికులు గమనించి కొండచిలువను రాళ్లు, కట్టెలతో కొట్టారు. దీంతో కొండచిలువ మృతి చెందింది. కోడిపుంజును వదిలిపెట్టినప్పటికీ అది అప్పటికే మృతి చెందింది. ఈ విషయాన్ని స్థానికులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, స్థానికంగా వైరల్ అయ్యింది. పక్కనే గండికోట వెనుక జలాలు ఉండటంతో తరచూ ఇళ్ల వద్దకు ఇలాంటి పాములు వచ్చి చేరుతున్నాయని, స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

కుటుంబం అదృశ్యం

ఎర్రగుంట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డు కాల్వ కట్ట సమీపంలో చరణ్ డ్రైవింగ్ స్కూల్ నడుపుతున్న నరేష్ తన కుటుంబంతో మూడురోజులుగా కనిపించడం లేదు. నరేష్ తండ్రి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా... మహాత్మానగర్‌లో నివాసం ఉంటున్న నరేష్ కొంతకాలంగా డ్రైవింగ్ స్కూల్ నడుపుతున్నాడు. అతని ఇంటి పక్కనే తల్లిదండ్రులు కూడా మరో ఇంట్లో నివాసం ఉంటున్నారు. నరేష్‌కు భార్య భార్గవి, కుమారులు చరణ్, శ్రావణ్‌లు ఉన్నారు. బుధవారం నుంచి వారు కనిపించడం లేదని, అత్తగారి ఇంటికి వెళ్లి ఉంటారని అనుకున్నామని, అయితే అక్కడా లేరని, ఫోన్లు కూడా పనిచేయడం లేదని నరేష్ తండ్రి చంద్రాయుడు శుక్రవారం రాత్రి పోలీసులు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నరేష్ కుటుంబంతో సహా కనిపించకుండా వెళ్లడానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై ముగ్గుల పోటీలు

కడప కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం జిల్లా వైద్య ఆరో గ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ శాఖల ఆద్వర్యంలో ముగ్గుల పోటీ లు, కొవ్వొత్తుల ర్యాలీలు జరిగాయి. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాకాధికారి డాక్టర్ నాగరాజు, జిల్లా అదనపు డీఎం హెచ్‌వో, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ నగిలి రవిబాబు హైరిస్క్ గ్రూపులకు చెందిన వారితో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు డిసెంబరు 1న ఎయిడ్స్ దినం సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డెమో భారతి, క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి భాస్కర్, దిశా టీం సభ్యులు, టీబీ యూనిట్, స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రసవత్తరంగా క్రికెట్‌మ్యాచ్‌లు



యాసిన్ సిద్దిక్

కడప స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. కేవోఆర్ఎం మైదానంలో సౌత్‌జోన్ విన్నర్స్, రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 48.2 ఓవర్లలో కేవలం 123 పరుగులకే కుప్పకూలిం ది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 41 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. ఇందులో విఘ్నేష్ 34 పరు గులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. దీంతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 53 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించింది.

ఏసీఏ క్రికెట్ మైదానంలో సెంట్రల్ జోన్ విన్నర్స్ రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్‌జట్ల మధ్య మ్యాచ్ సాగింది. టాస్ నెగ్గిన సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టు బ్యాటింగ్ చేపట్టి మొదటి ఇన్నింగ్స్‌లో 79.3 ఓవర్లలో 235 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఇందులో యాసిన్ సిద్ధిక్ 91 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 19 పరుగులు చేసింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో రెస్ట్‌ఆఫ్ సౌత్ జోన్... రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్ల మధ్య మ్యాచ్ సాగింది. ఇందులో టాస్ నెగ్గిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 80.1 ఓవర్లలో 206 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో 1 వికెట్ నష్టపోయి 12 పరుగులు చేసింది. దీంతో నార్త్ జోన్ జట్టు మరో 194 పరుగుల వెనుకంజలో ఉంది.

జాతీయస్థాయి హాకీ పోటీలకు చరిత



పులివెందుల రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పులి వెందుల శ్రీవిద్యాధరి హైస్కూల్‌కు చెందిన ఎస్.చరిత జాతీ యస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల సీఈఓ భానుప్రకాష్ తెలిపారు. ఈనెల 22 నుంచి 25వ తేదీ వర కు తిరుపతి జిల్లా చంద్రగిరిలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడ రేషన్ అండర్-14 బాలికల హాకీ టోర్నమెంట్‌లో ఎస్.చరిత అద్భుత ప్రతిభ కనబరచడంతో ఆంధ్రప్రదేశ్ అండర్-14 హాకీ జట్టుకు ఎంపికైందన్నారు. డిసెంబరు 22 నుంచి 27వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 హాకీ టోర్నమెంట్‌లో పాల్గొం టుందన్నారు. విద్యార్థిని ఎంపిక పట్ల పాఠశాల ఉపా ధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

'స్లీప్‌వెల్ బ్రాండ్ అగరబత్తులు వాడవద్దు'



గోడౌన్లను తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

మైదుకూరు రూరల్/ పోరుమామిళ్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆషికాష్ కంపెనీకి చెందిన స్లీప్ వెల్ బ్రాండ్ అగరబత్తులలో ప్రాణాంతకమైన పురుగుల మందుల అవశేషాలు ఉన్నాయని, వాటిని వాడకూడదని మైదుకూరు వ్యవసాయ సంచాలకులు క్రిష్ణమూర్తి తెలిపారు. మైదుకూరు పట్టణంలోని పలు నిత్యావసర సరుకుల గోడౌన్లలో వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ అగరబత్తులలో ప్రాణాంతకమైన మేపర్ ఫ్లూత్రిన్ అనే పురుగుల మందుల అవశేషాలు ఉన్నట్లు మెడికల్ ల్యాబ్‌లో నిర్ధారణ అయినట్లు ఆయన తెలిపారు. మండల వ్యవసాయశాఖ అధికారి బాల గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, పోరుమామిళ్లలోని పలు సూపర్ మార్కెట్లలో వ్యవసాయాధికారులు తనిఖీలు చేశారు. ఆయా దుకాణాల్లో ఆషికాష్ కంపెనీ తయారు చేసే స్లీప్‌వెల్ అగరబత్తుల అమ్మకాలు, వాటి నిల్వలపై తనిఖీలు చేశారు.

పరిశోధన విధానాలపై సమగ్ర అవగాహన అవసరం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పరిశోధన విధానాలపై ప్రతి విద్యార్థికి సమగ్ర అవగాహన అవసరమని వరంగల్ ఎన్ఐటీ ఫ్యాకల్టీ రామచంద్రగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం యోగి వేమన విశ్వవిద్యాలయం రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో పరిశోధకుల కోసం నిర్వహించిన రీసెర్చ్ ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌లో పేరెన్నికగన్న నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కృత్రిమ మేధా ఆధారిత పరిశోధనా సాధనాలపై విశ్లేషణాత్మకంగా మాట్లాడారు. సాహిత్య సమీక్ష, డేటా విశ్లేషణ, థీసిస్ రచనలో ఏఐ ప్రాముఖ్యతను వివరించారు. హైదరాబాద్ నాల్సార్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బుర్రా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ రీసెర్చ్ మెథడాలజీపై ప్రాక్టికల్ సెషన్ నిర్వహించారు. పరిశోధనలో ఉపయోగించే సాఫ్ట్‌వేర్‌లు, విశ్లేషణాత్మక గణాంక పద్ధతులను వివరించారు. ఇంటరాక్టివ్ బోధన ద్వారా పరిశోధన రూపకల్పన, గణాంక విశ్లేషణ, ఫలితాల అర్థం చేసుకోవడంలో విద్యార్థులకు స్పష్టత అందించారు.

రైతు ద్రోహి వైఎస్ జగన్

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతన్నలను దగా చేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే.. అది వైసీపీ ప్రభుత్వమేనని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిది వంగల శశిభూషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వైఎంఆర్ కాలనీలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 8వ తేదీ రైతాంగ దినోత్సవంగా ప్రకటించిన నాటి వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చి నట్టేట ముంచిందన్నారు. రాయలసీమలో హార్టికల్చరల్ హబ్ ఏర్పాటు చేస్తామని రైతులను నమ్మించి మోసం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు అన్యాయం చేస్తూ 90 శాతంగా ఉన్న డ్రిప్ ఇరిగేషన్ 70 శాతానికి మాత్రమే తగ్గించి ఇచ్చిందన్నారు. ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సన్నకారు, ఎస్సీ రైతులకు నూరు శాతం, రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను అందించామని తెలిపారు. ధాన్యం కొనుగోలులో వారంలోపు రైతులకు బకాయిలు కూటమి ప్రభుత్వం జమ చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, పి.వి.జయలక్ష్మీ, కంబగిరి, వంకధార నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు కాంగ్రెస్ పార్టీలో భగ్గుమన్న విభేదాలు



సమావేశంలో ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

జమ్మలమడుగు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు కాంగ్రెస్ పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. గతంలో పాముల బ్రహ్మానందరెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉంటూ కాంగ్రెస్ పార్టీ తరుపున ఎమ్మెల్యేగా పోటీ చేశారు. తర్వాత ముద్దనూరు మండలానికి చెందిన సింగం శివమోహన్‌రెడ్డిని నియమించారు. అప్పటి నుంచి ఆయన అప్పుడప్పుడు కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం పిలుపుమేరకు సమావేశాలు నిర్వహించేవారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం జమ్మలమడుగు పట్టణంలోని పతంగే ఫంక్షన్ హాలులో పార్టీ నియోజకవర్గ సంస్థాగత నిర్మాణంపై సభా కార్యక్రమం సింగం శివమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సమావేశానికి పలు ప్రాంతాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు పాముల బ్రహ్మానందరెడ్డిని స్టేజీపైకి పిలిచి గౌరవించలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. స్టేజీపై ఉన్న నాయకులపైకి ఆరోపణలు చేశారు. తాను మూడుసార్లు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా పోటీ చేశానని, తనను నిర్లక్ష్యం చేశారన్నారు. దీంతో అక్కడున్న నాయకులు జమ్మలమడుగులో ఇన్‌చార్జిగా ఉంటూ నీవు చేసిన ఘన కార్యాలు అందరికీ తెలుసన్నారు. ఇలా మాటా మాట పెరిగి ఒకరిపై ఒక రు ఆరోపణలు చేసుకున్నారు. దీంతో సమావేశం రసాభసాగా మారింది. కార్యక్రమంలో ఎంపీ విజయ్‌వసంత్, డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి, ప్రొద్దుటూరు, పులివెందుల ప్రాంతాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

బాలోత్సవానికి బియ్యం వితరణ



బియ్యం వితరణ చేస్తున్న కడప నగర టీడీపీ అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్, చిత్రంలో ఖాసీంఖాన్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సెయింట్ మేరీ జోసెఫ్ పాఠశాలలో జరగబోయే బాలోత్సవ కార్యక్రమానికి లయన్ పి ఖాసీంఖాన్ తల్లిపేరు మీద ఉన్న మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 500కేజీల బియ్యాన్ని అందజేస్తున్నట్లు టీడీపీ నగర అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్ తెలిపారు. శుక్రవారం బాలోత్సవం కమిటీ సభ్యులకు బియ్యం అందజేశారు. సీనియర్ ఇన్‌కమ్ ట్యాక్స్ అండ్ సేల్స్ ట్యాక్స్ ఆడిటర్ లయన్ పి.ఖాసీంఖాన్, రిటైర్డ్ ఎంఈఓ నాగమునిరెడ్డి, గుర్రాల గోపాల్, సత్తార్ ఫైజీ, రాజశేఖర్, రాహుల్, అమీన్, తౌసిఫ్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ, వీధిలైట్లపై ఆరా తీసిన కడప ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప మారుతీనగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మన కడప, స్వచ్ఛ కడప కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కడప ఎమ్మెల్యే మాధవి నగర 34వ డివిజన్ ఏకే ఫంక్షన్ హాలు పరిధిలో సంబంధిత అధికారులతో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. ఆయా ప్రాంతాల్లో గల డ్రైనేజీ చెత్త నిర్వహణ, వీధిలైట్ల పరిస్థితి,సౌకర్యాలపై అధికారులు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆ డివిజన్ ఇన్‌ఛార్జ్ జావీద్‌బాషా, టీడీపీ నగర అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్, కార్యదర్శి సుబ్బారెడ్డి, 34వ బూత్ ఇన్‌చార్జి అక్రమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణ వ్యవస్థపై సమీక్ష



చెత్త వేరు చేసే విధానాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.మనోజ్‌రెడ్డి శుక్రవారం చెత్త నిర్వహణ వ్యవస్థపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డు,మెటీరియల్ రికవరీ సెంటర్ (ఎంఆర్‌సీ), మైక్రో కంపోస్టింగ్ సెంటర్లను సందర్శించారు. డంపింగ్ యార్డులో చెత్త వేరు చేసే విధానాన్ని పరిశీలించిన కమిషనర్, కంపోస్ట్ అయిన మట్టిని సమయానికి డిస్పర్స్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మెటీరియల్ రికవరీ సెంటర్‌ను సందర్శించిన ఆయన, పొడి చెత్త వడపోత విధానాన్ని పరిశీలించి ఉపయోగం లేని చెత్తను సిమెంట్ ఫ్యాక్టరీలకు తరలించేలా వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే మైక్రో కంపోస్టింగ్ సెంటర్‌లో తడిచెత్తను కంపోస్ట్ చేసే విధానాన్ని సమీక్షించి తయారైన కంపోస్ట్‌ను చెట్లకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఈఈ, ఎంహెచ్‌ఓ, డీఈ,ఏఈ, ఎస్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి'

కడప ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌యూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరం డీఈఓ కార్యాలయం ఎదుట ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు కొండయ్య, గురుమోహన్, రాఘవ, కిరణ్, ప్రమోద్, రవి పాల్గొన్నారు.

In the Court of the Hon'ble Additional Senior Civil Judge at Kadapa.
E.P. No. 17/2024
O.S. No. 221/2012

C. Dasaratha Rami Reddy
... Decree Holder / Plaintiff
Verses
V. Ravindra Reddy having died his legal heirs
1) V. Suneel Kumari Wife of late V. Ravindra Reddy, aged about 49 years, Hindu, 2) V. vasavi D/o Late V. Ravindra Reddy, aged about 27 years Hindu, 3) V. Sindhu D/o Late V. Ravindra Reddy, aged about 23 years Hindu, All are residing at Krishnamgaripalle Village, Thondur Mandal, YSR Kadapa Dist
... Judgement Debtors/Defendants

NOTICE

Whereas the above Decree Holder / Plaintiff has filed the above E.P. against all of you to send for the attached death benefits amount of V. Ravindra Reddy from his drawing officer to the above said Hon'ble Court and the above case stands posted on 16-12-2025 at 10.30 am for your appearance. Therefore take the notice through this paper publication and all of you appear before the said Hon'ble court either personally or through your advocate. if all of you fail to attend before the Hon'ble Court, ex-parte orders will be pass against all you for your absence

BY THE ORDERS OF THE HON'BLE COURT
Amanchi N.V. Rayudu, B.Sc., LL.B.
Advocate for the Decree Holder / Plaintiff,
Kadapa Town. Cell : 97045 63064

మార్చరా..!

- రోడ్డు విస్తరణకు అడ్డంకిగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు తొలగించేదెన్నడు..?



చెన్నూరు కొత్తరోడ్డు వద్దహైవేలో సర్వీసు రోడ్డు వేసే ప్రాంతంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మరు



సర్వీసు రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్‌స్తంభాలు

చెన్నూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులోని కొత్తరోడ్డు హైవేలో రోడ్డు విస్తరణ పనులలో భాగంగా చేపట్టిన సర్వీసు రోడ్లు, డ్రైన్లు ఏర్పాటుకు ప్రస్తుతం అడ్డంకిగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్‌స్తంభాలు ఎప్పుడు తొలగిస్తారని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల పది రోజులక్రితం హైవేలో సర్వీసు రోడ్లు చేపడతాం, బస్‌షెల్టర్లు కడతాం డ్రైన్లు వేస్తామంటూ చెప్పిన హైవే అధికారులు ఇప్పటికీ అదే సర్వీసు రోడ్డులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు విద్యుత్‌స్తంభాలను ఇంకా తొలగించకుండా అలాగే ఎందుకు పెట్టినట్లు, ఎప్పుడు మార్పులు చేస్తారని అడగడం జరుగుతోంది. ఇటీవల కాలంలో హైవే అధికారులు ఈ సర్వీసు రోడ్లుకు అడ్డంకిగా ఉన్న వాటిని తొలగించాలంటూ సంబంధిత విద్యుత్‌శాఖాధికారులకు లేఖ రాయడం జరిగింది. అయితే హైవే అధికారులు దగ్గరుండి ఆ పనులు చేయించాలని అలా కాకుండా లేఖతో సరిపెడితే ఎలా అని ప్రజలు అడుగుతున్నారు. ఇప్పుడేమో తాత్కాలిక నిర్మాణాలన్నీ తొలగించినప్పటికీ అసలు అడ్డుగా ఉండేది ఇవే కదా, వీటికి ఎక్కువ సమయం పడుతుంది, త్వరగా మార్చాలంటూ అడుగుతున్నారు. సంబంధిత హైవే అధికారులు ధ్గగరుండి సర్వీసు రోడ్లు వేసేందుకు అడ్డుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు తక్షణం మార్చాలని కోరుతున్నారు.

స్కూలు వాహనాలు తనిఖీ

సీకేదిన్నె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్కూలు బస్సుల తనిఖీని ముమ్మరంగా చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 37 వాహనాలను పరిశీలించి అన్ని వాహనాలు కండీషన్‌లో ఉన్నట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు. వాహన తనిఖీల్లో వాహన ఇన్‌స్పెక్టర్లు విజయభాస్కర్, లక్ష్మీప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

లింగాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సమాజంలో మహిళలపై జరుగుతున్న సంఘటనలు, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పులివెందుల రూరల్ సీఐ ఎన్‌వీ రమణ అన్నారు. లింగాల జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎస్ఐ అనిల్‌కుమార్ మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్ప్‌లైన్ నెంబర్లు గురించి అవగాహన కల్పించారు.

'నిరుద్యోగ భృతి ఎప్పుడు'

కమలాపురం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తామని హామీ ఇచ్చారని ఎప్పుడు అమలు చేస్తారు అని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. శుక్రవారం కమలాపురంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు.

పంటలలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి



వేంపల్లె.. పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పులివెందుల రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శనగ,ఆముదం పంటలలో సస్యరక్షణ పద్ధతులు పాటించాలని ఏవో చెన్నారెడ్డి, టెక్నికల్ వ్యవసాయాధికారి సునీల్‌కుమార్‌రెడ్డి రైతులకు సూచించారు. రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని అచ్చవెల్లి గ్రామంలో సాగులో ఉన్న శనగ, ఆముదం పంటలను వారు వారు పరిశీలించారు. అనంతరం అచ్చవెల్లి రైతు సేవా కేంద్రంలో రైతులకు సబ్సిడీతో అందిస్తున్న పురుగు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వేంపల్లె..: ఊటుకూరు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు మండలంలోని నందిపల్లె, కత్తలూరు గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో శుక్రవారం చామంతి, మినుము, పెసర, బుడ్డశనగ పంటలను పరిశీలించారు. ఊటుకూరు పరిశోధన కేంద్రం ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్, శాస్త్రవేత్తలు మాధురి, క్రిష్ణప్రియ, డాట్ సెంటర్ ప్రతినిధులు ఈ పంటలను పరిశీలించారు.

స్లీప్‌వెల్ బ్రాండ్ అగర్‌బత్తీలు వాడద్దు..: స్లీప్‌వెల్ బ్రాండ్ అగర్‌బత్తులు వాడకూడదని పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి రైతులు, ప్రజలకు సూచించారు. వేంపల్లెలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. స్లీప్‌వెల్ బ్రాండ్ అగర్‌బత్తుల్లో క్రిమిసంహారక మందులు ఉన్నాయని, ప్రజలకు ప్రమాదం పొంచి ఉందన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గం

కడప కలెక్టరేట్,నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆల్ ఆంధ్రప్రదేశ్ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం నూతన కార్యవర్గ ఎంపికలు జరిగాయి. జిల్లా ఏపీ ఎన్జీవో సంఘ అధ్యక్షుడు బి. శ్రీనివాసులు పర్యవేక్షణలో నగరంలోని ఆసంఘ కార్యాలయంలో శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడుగా బి.కాలమయ్య, జిల్లాకార్యదర్శిగా ఎం.గిరిధర్, జిల్లా సహాధ్యక్షులుగా వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షురాలుగా ఎస్.సానకి,బి.రామసుబ్బయ్య, రామచంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా విజయకుమారి,జాయింట్ సెక్రటరీగావై.నాగేష్, జిల్లా కోశాధికారిగా సుబ్బిరెడ్డి ఎంపికయ్యారు.

వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీ స్కాలర్ లక్ష్మీప్రవల్లికకు డాక్టరేట్



కడప ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయ వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ స్కాలర్ ఆర్.లక్ష్మీప్రవల్లికకు వైవీయూ డాక్టరేట్‌ను ప్రకటించింది. లక్ష్మీప్రవల్లిక ఆ శాఖ సహ ఆచార్యుడు డాక్టర్ ఆర్.ప్రదీప్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఎ కాంప్రహెన్సివ్ ఫ్రేమ్ వర్క్ ఫర్ బ్రెయిన్ ట్యూమర్ సెగ్మెంటేషన్ యూజింగ్ ఆప్టిమైజ్డ్ క్లస్టర్ అల్గారిథమ్ అండ్ డీప్ ఎన్కోడర్ - డీకోడర్ ఆర్కిటెక్చర్ విత్ డైస్ లాస్ అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్‌వి కృష్ణారావు స్కాలర్ లక్ష్మీప్రవల్లికకు పీహెచ్‌డీ నోటిఫికేషన్‌ను ప్రకటించారు.

ఉత్తమ మహిళా టీచర్ ఆచార్య శేష మహేశ్వరమ్మ



అనంతపురం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): 'ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ - షయోస్టా అక్తర్ మెమోరియల్ నేషనల్ అవార్డు ఫర్ ఇంజనీరింగ్ కాలేజెస్' ఉత్తమ మహిళా టీచర్-2025కు జేఎన్‌టీయూఏ పులివెందుల ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య శేష మహేశ్వరమ్మ ఎంపికయ్యారు. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ 55వ జాతీయ వార్షిక అధ్యాపక సదస్సును పురస్కరించుకుని అవార్డులను ప్రదానం చేస్తున్నారు. పుదుచ్చేరిలోని శ్రీ మనకుల వినాయకర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరగున్న సదస్సులో అవార్డును అందజేస్తారు. తనకు అవార్డు దక్కడం సంతోషంగా ఉందని ఆచార్య శేష మహేశ్వరమ్మ అన్నారు. ఆమెను వర్సిటీ వైస్ చాన్సలర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్‌డీ టు వీసీ ఆచార్య దేవన్న అభినందించారు.

నేటి నుంచి కడప బాలోత్సవం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాల్యంలోని మధురిమలను తమ మనోఫలకంపై జీవితకాలం గుర్తుంచుకునే రెండు రోజుల చిన్నారుల పండగ బాలోత్సవానికి సర్వం సిద్ధమైంది. కడప మరియాపురంలోని సెయింట్ జోసఫ్ బాలికల పాఠశాల వేదికగా జరిగే కడప బాలోత్సవానికి దాదాపు 6 నుంచి 8వేల మంది బాలబాలికలు హాజరయ్యే అవకాశం ఉంది. అందుకు తగ్గట్లు వివిధ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ముఖ్య అతిథులుగా కడప ఎమ్మెల్యే మాధవి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడు, డీఈఓ షంషుద్దీన్ హాజరుకానున్నారు. సృజనను పెంచే చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, సంప్రదాయం, శాస్త్రీయ నృత్యాలు, ఆటపాటలు, కథలు పిల్లలు స్వేచ్ఛగా వారి ఆలోచనలను అభిప్రాయాలను వ్యక్తం చేసే కార్యక్రమాలు నిర్వహిస్తారు. శని, ఆదివారాలు రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాలకు అల్పాహారం, భోజన సౌకర్యంతో పాటు, ప్రతిభావంతులకు బహుమతులు సర్టిఫికెట్లు అందజేయనున్నారు.

ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండండి

లింగాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండి కుటుంబంతో ప్రశాంతమైన జీవితం గడపాలని,పిల్లలకు ఉన్నత చదువులు అందించి వారికి మంచి భవిష్యత్తు అందివ్వాలని సీఐ ఎన్‌వీ రమణ అన్నారు. లింగాల మండలం కోమన్నూతల గ్రామంలో శుక్రవారం పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ ఇటీవల సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని జాగ్రత్తగా ఉండాలన్నారు. వచ్చే పంచాయతీ ఎన్నికల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలని, రౌడీలను, అనుమానితులను ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనిల్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవోద్యమ పితామహుడు పూలే

వర్ధంతిలో పలు పార్టీల ప్రజా సంఘాల నేతలు

కడప మారుతీనగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక విప్లవోద్యమ పితామహుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని పలు పార్టీల ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. పూలే వర్ధంతి పురస్కరించుకుని పాత బస్టాండ్ కూడలి వద్ద గల పూలే విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో బీసీ. మహాసభ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎం. బాలకృష్ణయాదవ్, జనసేన పార్టీ నాయకుడు జీ.వీ.రమణ, మాజీ కడప ఎమ్మెల్యే అంజాద్‌బాష, బీ.సీ. సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, త్రివిక్రమ్, నాయకులు కళ్యా సుధాకర్, ఖాదర్‌బాష, ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డి.యం.ఓబులేసు, బలిజ సంఘం నాయకులు సగినాల శ్రీనివాసులు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్, పలువురు నాయకులు ఉన్నారు.

అందరికీ ఆదర్శప్రాయుడు మహాత్మాజ్యోతిరావు పూలే



నివాళులు అర్పిస్తున్న అంజాద్‌బాష, పాకా సురేష్

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అందరికీ ఆదర్శప్రాయుడు పూలే అనిమాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష తెలిపారు. శుక్రవారం కడప నగరం పాత బస్టాండ్ పూలే సర్కిల్ వద్ద సర్కిల్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ నగర అధ్యక్షుడు గంగరాజు వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేష్, ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వర్మీకంపోస్టుపై అవగాహన పెంచాలి

చెన్నూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైతు పండించే ఏ పంటకు అయినా వానపాముల ఎరువు వాడితే ఎంతో ప్రయోజనకరమని జడ్పీ సీఈవో ఓబులమ్మ అన్నారు. చెన్నూరులోని ఎస్‌డబ్ల్యూపీసీల వద్ద వర్మీకంపోస్టు తయారీ కేంద్రాన్ని శుక్రవారం జడ్పీ సీఈవో పరిశీలించారు. అక్కడ ఎన్ని తొట్లలో వర్మీకంపోస్టు తయారవుతుంది, తయారయ్యేందుకు ఎంత కాలం పడుతుంది, ఎలాంటి పదార్థాలు తయారీకి వాడుతారు, వాటి రక్షణ, వానపాములు ఎక్కడ నుంచి తెప్పిస్తారు,తయారైన తరువాత రైతుకు ఎరువులు ఏ ధరకు అమ్ముతారు వంటి వాటిపైన అక్కడి గ్రీన్‌కార్డులను పిలిచి అడగారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, డిప్యూటీ ఎంపీడీవో గురువేశ్వర్‌రావు, సర్పంచ్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రేపు పీఎస్ హెచ్‌ఎంల సమావేశం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప కొత్త ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉండే సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10గంటలకు జిల్లాలోని ప్రైమరీ స్కూళ్ల హెచ్‌ఎంల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీపీఎస్ హెచ్‌ఎం ఫోరం రాష్ట్ర అధ్యక్షులు సీవీ ప్రసాద్, కార్యదర్శి వరలక్ష్మి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. తదుపరి పీఎస్ హెచ్‌ఎం ఫోరం జిల్లా కమిటీని ఏర్పాటుచేస్తామని తెలిపారు. జిల్లాలోని ప్రతి పీఎస్ హెచ్‌ఎం హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఉషారాణి

పులివెందుల రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సర్వేలో భాగంగా ఇంట్లోని ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఉషారాణి సిబ్బందికి సూచించారు. శుక్రవారం పట్టణంలోని బాకరాపురం యూపీహెచ్‌సీని తనిఖీ చేసి ఇంటింటి సర్వే విధానాన్ని పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ స్పర్శలేని రాగి రంగు మచ్చలు లేదా నరాలు అనుమానపు లక్షణాలుంటే వారిని గుర్తించి వెంటనే ఆసుపత్రికి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాజామొయిద్దీన్, డాక్టర్ శాంతికుమార్, డీపీఎంఓ సుబ్బారెడ్డి తదితరులుపాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన కలిగి ఉండాలి

పులివెందుల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ శక్తియాప్ గురించి అవగాహన కలిగి ఉండాలని సీఐ సీతారామిరెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని రమణప్ప స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆపద సమయంలో గాని, ఎవరైనా ఆపదలో ఉంటే 100, 112 నెంబర్లకు ఫోన్ చేయాలని సీఐ సూచించారు. అలాగే బాల్య వివాహాల వలన కలిగే ఇబ్బందులను వివరించారు. అలాగే సైబర్‌క్రైం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.కాగా తొండూరు మండలంలోని మల్లేల గ్రామంలో ఎస్ఐ మహిళలకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ బాలమద్దిలేటి

సీకేదిన్నె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని ఇందుకు యువత కీలక పాత్ర పోషించాలని చింతకొమ్మదిన్నె సీఐ బాలమద్దిలేటి తెలిపారు. మండలంలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో పోలీసు కళాజాగృతి బృందం ద్వారా శుక్రవారం విద్యార్థులకు డ్రగ్స్ రహిత సమాజంపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరప్రసాద్, నార్కోటిక్ ఏఎస్ఐ మల్లయ్య, లీగల్‌టీం ఆయూబ్, తదితరులు పాల్గొని యువత మేలుకో, మత్తు నుంచి తేరుకో, డ్రగ్స్ వద్దు, జీవితం ముద్దు అనే నినాదాలను విద్యార్థులకు వినిపించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాజాత బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని ఎర్రమాచుపల్లె సూపర్‌కే గోడౌన్‌లో మహిళల సంరక్షణ, జాగ్రత్తలపై ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి మహిళలకు అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో అందించాల్సిన సేవలు, సోషల్ మీడియా, సైబర్ నేరాల గురించి మహిళలకు వివరించారు.

అమీన్‌పీర్ దర్గాను సందర్శించిన రాజు వెడ్స్ రాంబాయి చిత్ర బృందం

కడప కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన రాజు వెడ్స్ రాంబాయి సినిమా విజయవంతంగా ప్రదర్శించబడుతున్న సందర్భంగా ఆ చిత్రయూనిట్ బృందం శుక్రవారం కడప పెద్ద దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో అఖిల్‌రాజ్, హీరోయిన్ తేజస్వి, దర్శకుడు సాయిల్ కంపాటి మాట్లాడారు.



వీర ఉదయశ్రీకి సన్మానం



ఉదయశ్రీ ని సన్మానిస్తున్న ఎస్‌టీయూ నాయకులు

మైదుకూరు నవంబరు28(ఆంధ్రజ్యోతి): అమరావతిలో జరిగిన విద్యార్థుల మాక్ అసెంబ్లీలో ప్రతిపక్షనేతగా గిరిజన తాండాల రహదారి సమస్యలపై మాట్లాడి అందరి మన్ననలు పొందిన శెట్టివారిపల్లి జిల్లాపరిషత్ స్కూల్ విద్యార్థిని పసల వీర ఉదయశ్రీని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మొమెంటో ఇచ్చి,శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకొండయ్య, హెడ్మాస్టర్ అహల్య, నాయకులు రామమోహన్, కిరణ్‌కుమార్, చంద్రశేఖర్, సురేష్ పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

ప్రొద్దుటూరు , నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు మున్సిపల్ సభా భవనంలో జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ భీముని పల్లె లక్ష్మీదేవి ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సమావేశంలో 22 అంశాల అజెండా పై చర్చించి ఆమోదించనున్నారు. కౌన్సిల్ సభ్యులతోపాటు మున్సిపల్ కమిషనర్ ఇతర అధికారులు హాజరుకావాలని ఆ ప్రకటనలో తెలిపారు.

ఈవ్‌టీజింగ్ అరికట్టేందుకు విజిబుల్ పోలీసింగ్

మైదుకూరు నవంబరు28(ఆంధ్రజ్యోతి): మహిళల, పిల్లల భద్రతకోసం అర్బన్ సీఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో విజిబుల్ పోలీసింగ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల వద్ద ఈవ్‌టీజింగ్ అరికట్టేందుకు పోలీసుల పహారా ఉంచారు. ఆకతాయిలు ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే 100కు గాని, నేరుగాగాని సమాచారం ఇవ్వాలన్నారు.

రూ.24లక్షలు ఎస్‌బీఐ బీమా సొమ్ము అందజేత

ఎర్రగుంట్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): భారతీయస్టేట్‌బ్యాంక్‌లో ప్రమాద బీమా చేసిన కుటుంబానికి చీఫ్ మేనేజర్ రామారావు రూ.24లక్షల చెక్కును శుక్రవారం అందజేశారు. ఎర్రగుంట్ల ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో గంగిరెడ్డిపల్లెకు చెందిన ఎల్.శంకర్ రూ.1000 ఎస్‌బీఐ ప్రమాద బీమా, రూ.20 పీఎంఎస్‌బీవై, రూ.460 పీఎంజేజేబీవై ఇన్సూరెన్స్ చేశారు. అయితే శంకర్ ఇటీవల ప్రమాదంలో మరణించాడు. దీంతో అతనికి మూడు ప్రమాదాల బీమా ద్వారా మొత్తం రూ.24లక్షలు మంజూరు అయినట్లు చీఫ్ మేనేజర్ రామారావు తెలిపారు. ఈమొత్తం చెక్కును బాధితుని నామినీ అయిన ఎల్.అమ్ములుకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బజార్ మేనేజర్ ఎలమందారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కానగూడూరులో సిమెంటు రోడ్డు నిర్మాణం



బీసీ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు

దువ్వూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం కానగూడూరు గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణం పనులు శుక్రవారం ప్రారంభించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. 15వ ఫైనాన్స్ నిధులు కేటాయించి బీసీ కాలనీలో సిమెంటు రోడ్డు పనులు చేపట్టారు. ఈ మేరకు పంచాయతీరాజ్ ఏఈ సుబ్రమణ్యం వాటిని పరిశీలించి నాణ్యతగా రోడ్డు వేయాలని ఆదేశించారు.

చెరువును పట్టించుకోండి



నిండు కుండలా పోరుమామిళ్ల చెరువు

- దుస్థితిలో పోరుమామిళ్ల చెరువు తూములు
- బలహీనంగా మారిన చెరువు కట్టలు
- చరిత్ర ఘనం.. నిర్వహణ అధ్వానం
- ఆయకట్టుకు సమస్యలేకుండా చూడాలంటున్న రైతన్నలు

పోరుమామిళ్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చెరువు చరిత్ర చూస్తే శతాబ్దాలది. కానీ వాటి నిర్వహణ అధ్వానంగా తయారైంది. పోరుమామిళ్ల చెరువు కట్ట చుట్టూ కంపచెట్లు పెరిగిపోయి తూములు, పిచ్చిమొక్కలు, కంపచెట్లతో నిండిపోయి దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. అధికారికంగా 4600 ఎకరాల ఆయకట్టు ఉన్నా అనధికారికంగా దాదాపు పదివేల ఎకరాలకు ఈ చెరువు ద్వారా నీరు అందడమే కాకుండా ఆ చుట్టుపక్కల వ్యవసాయ బోర్లు రీఛార్జ్ అయ్యేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. అలాంటి చెరువును మెయింటెనెన్స్ చేయడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెరువు నిండినప్పు డు అధికారులు వచ్చి పరిశీలించి వెళుతుంటారే తప్ప కంపచెట్లు, తూముల వద్ద పేరుకున్న ముళ్ల పొదలు తొలగించే చర్యలు చేపట్టలేదు. గతంలో తెలుగుగంగ ప్రాజెక్టు నీరు బొక్కినేరు ద్వారా చింతలపల్లె చెరువు నుంచి పోరుమామిళ్ల చెరువుకు చేరేది. మల్దేవివాగు నుంచి కూడా ఈ చెరువుకు నీళ్లు వస్తాయి. పోరుమామిళ్ల చెరువు నుంచి గానుగపెంట వరకు దాదాపు 22 చిన్న చెరువులకు కొండుగారిపల్లె వద్ద ఉన్న తూము ద్వారా సరఫరా అవుతాయి. అంతేకాక ఇటు టేకూరుపేట, అటు కొత్రపాటిపల్లె, కవలకుంట్ల వరకు ఈ చెరువు విస్తరించి ఉంది. అలాంటి ప్రాధాన్యత గల ఈ చెరువును పట్టించుకునేవారు కరువయ్యారనే విమర్శలున్నాయి. చిన్నతూము, పెద్ద తూము, కాల్వలను మరమ్మతులు చేసి పంటకాల్వలు మరమ్మతులు చేస్తే చెరువులో నీరు రైతులు సద్విని యోగం చేసుకునే అవకాశాలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చెరువు కట్ట వద్ద ఉన్న కంపచెట్లు, ముళ్ల పొదలు, తొలగించాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.



చిన్నతూము వద్ద పెరిగిన కంపచెట్లు, పిచ్చి మొక్కలు



బలహీనంగా ఉన్న చెరువుకట్ట

ఎంపీ సీఎం రమేశ్‌ను పరామర్శించిన కలెక్టర్



ఎర్రగుంట్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌ను కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ శుక్రవారం పరామర్శించారు. ఎంపీ తల్లి రత్నమ్మ మృతి చెందిన విషయం తెలుసుకుని కలెక్టర్ పోట్లదుర్తిలోని ఎంపీ సీఎం రమేశ్ ఇంటికి వెళ్లి సంతాపం తెలిపారు. అనంతరం ఎంపీ తల్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ఎంపీ సీఎం రమేశ్ ఆయన సోదరులు సీఎంరాజేష్, సీఎం సురేష్‌లను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

10 ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

చాపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వి.రాజుపాళెం గ్రామం వద్ద ఉన్న పెన్నానదిలో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న పది ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కమలాపురం, వల్లూరు ప్రాంతాలకు ఈ ట్రాక్టర్లు చెందినవన్నారు. వాటిపై జరిమానా విధించేందుకు తహసీల్దారు రామాకుమారికి సిఫార్సు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఎస్‌ఆర్‌ఐటీ, చెన్నై హెచ్‌సీఎల్ టెక్‌తో ఒప్పందం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి ఉపాధి అవకాశాలు కల్పించడానికి చెన్నైకి చెందిన హెచ్‌సీఎల్ టెక్ సంస్థతో ఒప్పందం చేసుకుంటున్నట్లు ఎస్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఎస్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రతినిధులు, చెన్నై హెచ్‌సీఎల్ టెక్ సంస్థ ప్రతినిధులు ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ పాండురంగన్‌రవి మాట్లాడుతూ హెచ్‌సీఎల్ టెక్ కంపెనీ వారు కళాశాలలోని ప్రతి విద్యార్థికి జెన్‌ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మీద శిక్షణ ఇస్తారని, ప్రతి విద్యార్థికి ఏడాదికి మూడు సర్టిఫికెట్ల వంతున బీటెక్ పూర్తయ్యేలోపు 12 సర్టిఫికెట్లు ఇస్తారని తెలిపారు. ఈ సర్టిఫికెట్ల వలన హెచ్‌సీఎల్ టెక్ కంపెనీలో, ఇతర సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. జనవరి నుండి హెచ్‌సీఎల్ టెక్ సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు స్వయంగా వచ్చి శిక్షణ ఇస్తారన్నారు. ఈ ఒప్పందంపై ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు వీరకుమార్‌రెడ్డి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. హెచ్‌సీఎల్ టెక్ కంపెనీ హెడ్ వెంకటరామన్, రీజినల్ హెడ్ వినోద్ ఉన్నారు.

డ్రోన్‌తో క్రిమిసంహారక మందు పిచికారి

ముద్దనూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ముద్దనూరు మండలంలోని నల్లబల్లె గ్రామ రైతు తుమ్మలూరు వేణుగోపాల్‌రెడ్డి సాగు చేసిన కంది పంటలో డ్రోన్ ద్వారా ప్రయోగాత్మకంగా క్రిమిసంహారక మందును పిచికారి చేసే విధానాన్ని పరిశీలించినట్లు ఏవో మారెడ్డి వెంకటక్రిష్టారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుమతితో వ్యవసాయ శాఖ ద్వారా శిక్షణ పొందిన డ్రోన్ పైలెట్ భీంచర్ల రమేష్‌రెడ్డి కంది పంటకు డ్రోన్ పరికరంతో పిచికారి చేసినట్లు తెలిపారు. మండలంలోని పంటలకు పిచికారి చేయాలి అని ఆసక్తి ఉన్న రైతులు తమ మొబైల్ నెంబర్ 9573464714ను సంప్రదించాలన్నారు. గ్రామ యువ రైతులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

చాపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహిళా ఉపాధ్యాయులకు ప్రభుత్వం తరుపున ఎంఈవో రవిశంకర్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు చెందిన 31 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మహిళా ఉపాధ్యాయులు త్రోబాల్ ఆటలు ఆడారు. ఈ పోటీల్లో 12 మందిని మైదుకూరు నియోజకవర్గస్థాయి పోటీలకు అధికారులు ఎంపిక చేశారు. డిసెంబరు 13, 14 తేదీల్లో వీరు పోటీల్లో పాల్గొంటారు.

గండికోటలో తెలంగాణ విద్యార్థులకు శిక్షణ

జమ్మలమడుగు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని గండికోటలో అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో తెలంగాణకు చెందిన విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన నాథా ప్రాంతం పాఠశాల, కళాశాల విభాగాలకు చెందిన సుమారు 105 మంది విద్యార్థులు అడ్వెంచర్ నైపుణ్యాలను నేర్చుకోవడానికి సందర్శించారు. ఈ శిక్షణ కార్యక్రమం ఈనెల 28 నుండి డిసెంబరు 2వ తేదీ వరకు అయిదు రోజులపాటు కొనసాగుతుందని ట్రైనర్లు తెలిపారు. శిక్షకులు దుర్గారావు, ఎస్.ఆనంద్, అన్విత, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

రైతులకు అండగా డబుల్ ఇంజన్ సర్కార్

జమ్మలమడుగు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అండగా నిలుస్తున్నాయని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జమ్మలమడుగు మండలంలోని ఆదర్శ గ్రామమైన ఎస్.ఉప్పలపాడు గ్రామంలో రైతన్న మీకోసం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించారు. భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాలు పంట సాగు చేసి ప్రజల ఆరోగ్యానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, ఓబుళరెడ్డి, శివారెడ్డి, ఎంపీడీవో సైదున్నీసా, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెద్దముడియంలో : రైతుల కళ్లల్లోని ఆనందమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మేడిదిన్నె, చిన్నపసుపుల గ్రామాల్లో శుక్రవార రైతన్న మీకోసం కారక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి షరీఫ్, ఆయా గ్రామాల టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మైలవరంలో: రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తలమంచిపట్నం గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సాగునీరు, అన్నదాత సుఖీభవ పథకంతో రైతులకు భరోసా కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దగ్గుతుందన్నారు. . కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్, ఏడీఏ అనిత, ఏవో గురుభాస్కర్, తహసీల్దారు లక్ష్మినారాయణ, ఎంపీడీవో సోమశేఖర్‌రెడ్డి, మండల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం

జమ్మలమడుగు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించారు. ప్రజాదర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలు వారి వారి సమస్యలకు సంబంధించి వినతి పత్రాలు అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

బద్వేలుటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి నియోజవర్గంలోని ప్రజల సమస్యలు సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి పరిష్కరించడం జరిగింది.

రైతు పక్షపాతి కూటమి ప్రభుత్వం

కాశినాయన నవంబరు28(ఆంధ్రజ్యోతి):రైతు పక్షపాతిగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం మండలంలోని అమగంపల్లెలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత ఆనందంగా ఉండాలన్నదే ముఖ్యమంతి చంద్రబాబునాయుడి ఆలోచన అని ఆదిశగా కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో బద్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుప్రజ, కాశినాయన సహకార సంఘం చైర్మన్ బంగారు గురివిరెడ్డి.బద్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.రవీంద్రారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అగ్రిమెంట్లు తీసుకున్న తర్వాతే సాగు చేయండి

దువ్వూరు, నవంబరు28(ఆంధ్రజ్యోతి):విత్తనోత్పత్తి కింద సాగు చేసే జొన్న, మొక్కజొన్న సజ్జ పంటలకు సంబంధించి ఆర్గనైజర్ల వద్ద అగ్రిమెంట్లు తీసుకున్న తర్వాతే సాగుకు పూనుకోవాలని మండల వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. దువ్వూరు మండలం చింతకుంట, మీర్జాఖాన్‌పల్లె గ్రామాల్లో శుక్రవారం రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. అగ్రిమెంట్లు పొందని రైతులు పొరపాటు జరిగితే నష్టపోతారని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులతోపాటు వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

మైదుకూరు రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) :ప్రతి ఎకరాకు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకుడు పొలిమేర రాజగోపాల్‌రెడ్డి అన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమం శెట్టివారిపల్లె గ్రామంలో జరిగింది. మండల వ్యవసాయశాఖ అధికారి బాలగంగాధర్‌రెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం పాటుపడుతోందని తెలిపారు.

డ్రై డే తప్పనిసరి-డీఎంహెచ్‌ఓ

ఎర్రగుంట్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డ్రై డేని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని డీఎంహెచ్‌ఓ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఎర్రగుంట్ల మండలంలోని తిప్పలూరులో ఆయన పర్యటించి పలు వీధుల్లో ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఫ్రిజ్‌లో ఉంచిన చల్లటి పదార్థాలను తినరాదన్నారు. ఎయిర్‌కూలర్‌లో నీటి నిల్వను ఉంచరాదన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ వెంకటరెడ్డి, డాక్టర్ జ్యోత్స్న, ఎస్‌యు లక్ష్మయ్య, ఎంపీహెచ్‌వో రవిశంకర్‌రాజు, ఎంపీహెచ్‌ఎస్ ఓబులేసు, ఎంపీపీహెచ్‌ఏ వేణుగోపాల్, ఏఎన్‌ఎం శేషమ్మ, ఆశావర్కులు పాల్గొన్నారు.

రేపు వాల్మీకుల ఆత్మీయ సమ్మేళనం

పోరుమామిళ్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మదర్‌థెరిసా ఫౌండేషన్‌లో ఈ నెల 30న వాల్మీకుల ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని వాల్మీకి సంఘం నాయకులు మానం ఆంజనేయులు, నల్లబోతుల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోరుమామిళ్లలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వాల్మీకుల ఎస్టీసాధన కోసం జరిగే పోరాటలో వాల్మీకులు కలిసి ఎస్టీ సాధనకు కలిసి పోరాడాలని తెలిపారు.

యువత పూలే ఆశయాలను కొనసాగించాలి



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

బద్వేలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సామాజిక విప్లవకారుడు, గొప్ప సంఘసంస్కర్త మహాత్మజ్యోతిరావు పూలే ఆశ యాలను కొనసాగించాలని నాయీబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొలవళి వేణుగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం మహాత్మజ్యోతి రావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా సిద్దవటం రోడ్డులోని కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘ నంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులవివక్షత, అంట రానితనంపై పోరా టం చేసిన పోరాట యోధుడు, మహిళలకు విద్యావ కాశం కల్పించిన మహోన్నత వాది జ్యోతిరావు పూలే అన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సంఘం నాయకు లు గోవిందాయపల్లె క్రిష్ణ, జిల్లా ముదిరాజ్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, నాయిబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు గురు బ్రహ్మ, కొళవలి ప్రసాద్ పాల్గొన్నారు. కాగా పూలే ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహాత్మజ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పించారు. విగ్రహ కమిటీ సంఘం చైర్మన్ బద్వేలు గురుమూర్తి, వెంకటస్వామి, సతీష్‌రెడ్డి, సత్తార్, సుబ్బారావు, నారాయణ, ప్రసాద్, పిచ్చయ్య, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే..



పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీసీ నేతలు

ప్రొద్దుటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల ఆశా జ్యోతి మహాత్మాజ్యోతిరావు పూలే అని బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు కొనియాడారు. జ్యోతిరావు 136 వర్ధంతి సందర్భంగా స్థానిక బీసీ కార్యాలయంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ పూలే ఆశయాలు నెరవేరే వరకు బీసీ సంఘాలు బీసీ జనగనన కోసం పోరాడి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు సాధించుకోవాల్సిఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ ప్రజాచైతన్య సమాఖ్య ప్రధాన కార్యదర్శి చాబోలి దేవేంద్రుడు, కోశాధికారి మడక సంటెయ్య, ఉపాధ్యక్షుడు ప్రతాప్ నాయుడు, జీసీ పుల్లయ్య, కార్యదర్శి దస్తగిరి, సంయుక్త కార్యదర్శులు బత్తుల శ్రీనివాసులు తుపాకుల చౌడయ్యలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేద్దాం



కార్యకర్తలతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి

ప్రొద్దుటూరు అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేద్దామని కన్యాకుమారి ఎంపీ విజయ్‌వసంత్ కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాష ఆధ్వర్యంలో ఆయన కార్యాలయం వద్ద సంస్థాగత నిర్మాణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కన్యాకుమారి ఎంపీ విజయ్‌వసంత్, డీసీసీ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేద, బడుగు, బలహీన వర్గాల పార్టీ అన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షురాలు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ



సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి

బద్వేలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా పొందుపరిచే ప్రక్రియ నిరంతరంగా కొనసాగాలని తద్వారా ఓటరు జాబితా ఖచ్చితత్వం తెలుస్తుందని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్‌లు పేర్కొన్నారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో బూత్‌లెవెల్ ఎన్నికల సిబ్బందితో వారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా వారు పలు సూచనలు ఇస్తూ మృతి చెందిన ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన ఓటర్లను తొలగిస్తూ, నూతనంగా ఓటు నమోదు చేసుకునేవారిని ఓటరు జాబితాలో చేర్చాలన్నారు.ఈ కార్యక్రమంలో గోపవరం తహశీల్దారు త్రిభువన్ రెడ్డి , నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూలులో డిప్యూటీ డీఈవో విచారణ

ఖాజీపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా మోడల్ స్కూలులో జరుగుతున్న వ్యవహారంపై డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది నుంచి రాత పూర్వకంగా వారి అభిప్రాయాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్నతమైన స్థానంలో ఉండి తప్పు చేస్తే క్షమించేది లేదని నివేదికను డీఈవోకు అందజేస్తామన్నారు. ప్రిన్సిపల్ మాత్రం మతిస్థిమితం లేక అలా మాట్లాడుతున్నారని చెప్పడం జరిగిందని అన్నారు.

తూతూ మంత్రంగా విచారణ: ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుడు పిల్లలపట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా విచారణ తూతూ మాత్రంగా జరిగిందని విమర్శలు వస్తున్నాయి.

ఎంపీడీవోగా మైథిలీ రెడ్డి సేవలు అద్వితీయం



ఎంపీడీవో మైథిలీరెడ్డిని సన్మానించిన టీడీపీ నాయకులు

కాశినాయన నవంబరు 28(ఆంధ్రజ్యోతి) కాశినాయన మండలానికి ఎంపీడీవోగా డాక్టర్ బి.మైథిలీరెడ్డి అందించిన సేవలు అద్వితీయమని బద్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. డ్వామా ఏపీడీగా పదోన్నతిపై మైదుకూరుకు బదిలీపై వెళుతున్న ఎంపీడీవో మైథిలీరెడ్డిని శుక్రవారం టీడీపీ నాయకులు డి.క్రిష్ణారెడ్డి, పి.జయరామిరెడ్డి, పి.పోలిరెడ్డి తదితరులు కలిసి శాలువ పూలమాతో ఘనంగా సత్కరించారు. ఈకారక్రమంలో టీడీపీ నాయకులు నర్శిరెడ్డి, జయక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ మార్కెటింగ్ గదుల పరిశీలన



మార్కెటింగ్ గదులను పరిశీలిస్తున్న జిల్లా సూపరింటెండెంట్ సాంబయ్య

బ్రహ్మంగారిమఠం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వెలుగు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాలుగు మార్కెటింగ్ గదులను డీఆర్‌డీఏ వెలుగు సూపరింటెండెంట్ సాంబయ్య శుక్రవారం పరిశీలించారు. బ్రహ్మంగారిమఠం ఐదు రోడ్ల కూడలిలో నిర్మించిన నాలుగు గదుల్లో ఒక గది పంచాయతీ అధికారులు ఉండగా మిగిలిన 3 గదుల్లో దాదాపు ఆరేళ్ల నుంచి ఒక్కొక్కరు రూ.లక్షా 50వేలు చొప్పున రూ.3లక్షల దాకా బాడుగ బకాయి ఉన్నారు. ఈ విషయాన్ని మండల మహిళా సమాఖ్య సభ్యులు జిల్లాస్థాయి అధికారులకు తెలుపగా డీఆర్‌డీఏ వెలుగు సూపరింటెండెంట్ వచ్చి వెంటనే బకాయిలు మండల సమాఖ్య కు చెల్లించాలని లేనిపక్షంలో క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏపీయం చిన్న ఓబులేసు, సీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



పడిపోయిన వరిపైరును పరిశీలిస్తున్న వెంకటరమణ

చాపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలతో దెబ్బతిన్న వరి రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని జిల్లా రైతు సేవా సమితి అధ్యక్షుడు వెంకటరమణ కోరారు. మడూరు గ్రామంలో వర్షానికి నేలకొరిగిన వరి పైరును ఆయన శుక్రవారం పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రైతు సేవా సమితి నాయకులు రామాంజనేయులరెడ్డి, చంద్రశేఖర్, నరసింహ, సురేష్‌లు కూడా పాల్గొన్నారు.